APTEL/26/A0542

# స్ఫూర్తి పత్రిక

Voice of Truth

విలేకరులు కావలెను
స్ఫూర్తి పత్రిక డైలీ పేపర్ నందు
కర్నూలు,నంద్యాల,అనంతపురం, శ్రీ సత్యసాయి, వైయస్సార్ ,తిరుపతి, అన్నమయ్య ,చిత్తూరు ,జిల్లాలలో పనిచేసేందుకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ నియోజకవర్గ ఇన్చార్జీలు మండల రిపోర్టర్స్ కావలెను.
స్ఫూర్తి పత్రిక Voice of Truth
గతంలో పత్రికా రంగంలో పనిచేసిన అనుభవం వార్తలు చక్కగా రాయగలిగే నైపుణ్యం గల వారికి అవకాశం కలదు.
ఎటువంటి యాడ్స్ టార్గెట్లు లేదు. కొత్త వారికి అవకాశం కలదు.
ఆసక్తి గలవారు సంప్రదించండి : 8179446036,7794947413.

ప్రచురణ : కర్నూలు | సంపాదకుడు : నరసనాయుడు బోయ | సంపుటి : 01 సంచిక : 210 | పేజీలు : 04 వెల రూ. 2/- | ఆదివారం 20-09-2026

PUBLICATION : KURNOOL | EDITOR : NARASANAIDU BOYA | VOLUME : 01 ISSUE : 210 | PAGES : 04 PRICE : 2 | SUNDAY 20 SEPTEMBER 2026

## బెంగాల్ ఉపపోరు: మమత వర్గం పార్టీకి 'ఫుట్‌బాల్ ప్లేయర్'.. రెబల్ వర్గానికి 'ఎన్వలప్'




- తృణమూల్ కాంగ్రెస్‌లోని రెండు వర్గాలకు కొత్త పేర్లు, గుర్తులు కేటాయింపు
- మమత వర్గానికి 'మమత ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్' పేరు ఖరారు
- రెబల్ వర్గానికి 'డెమోక్రటిక్ తృణమూల్ కాంగ్రెస్'గా గుర్తింపు
- మమత వర్గానికి 'ఫుట్‌బాల్ ప్లేయర్', ఆరుప్ వర్గానికి 'ఎన్వలప్' చిహ్నం
- బెంగాల్ ఉపఎన్నికల కోసం ఈసీ తాత్కాలిక ఏర్పాటు

## పాకిస్థాన్‌లో మసీదుపై ఆత్మాహుతి దాడి.. 15 మంది మృతి




- పాకిస్థాన్‌లోని కోహట్‌లో మసీదుపై ఉగ్ర దాడి
- ఈ ఘటనలో ఐదుగురు పోలీసులతో సహా 15 మంది మృతి
- 50 మందికి పైగా తీవ్ర గాయాలు, పలువురి పరిస్థితి విషమం
- పోలీసు కార్యాలయమే లక్ష్యంగా దాడి జరిగినట్లు అనుమానం
- ఇప్పటివరకు ఏ ఉగ్రవాద సంస్థ బాధ్యత ప్రకటించలేదు




## దుగరాజపట్నంలో భారీ షిప్‌యార్డ్.. రూ.15 వేల కోట్ల పెట్టుబడి!

- దుగరాజపట్నంలో గ్రీన్‌ఫీల్డ్ షిప్‌యార్డ్
- ఎండీఎల్‌తో ఏపీ ప్రభుత్వ ఎంవోయూ
- ఐదేళ్లలో రూ.15 వేల కోట్ల పెట్టుబడి
- 45 వేల మందికి ఉపాధి అవకాశాలు
- ఏటా 12 లక్షల గ్రాస్ టన్నుల సామర్థ్యం

## రాయలసీమ పౌరుషం ఏమిటో చూపిస్తాం: విజయసాయిరెడ్డి




- సీమ ప్రాంత అభివృద్ధికి ప్రతిరూపంగా కొత్త పార్టీ రాబోతోందన్న విజయసాయిరెడ్డి
- టీడీపీ, వైసీపీ రెండూ కుటుంబ రాజకీయాలకే ప్రాధాన్యతనిచ్చాయని విమర్శ
- యువత భాగస్వామ్యంతో సీమను తిరిగి రతనాలసీమగా మారుస్తానని హామీ

అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కొత్త శకం ప్రారంభం కాబోతోందని, రాయలసీమ ప్రాంత అభివృద్ధి,

# విశాఖకు ఐటీ కళ.. అమరావతిలో క్వాంటం విప్లవం

### రూ.526 కోట్ల పెట్టుబడులతో 10 ఐటీ ప్రాజెక్టులకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం

- అమరావతి కేంద్రంగా క్వాంటం టెక్నాలజీ హబ్.. రూ.2,700 కోట్లతో సృష్టి క్వాంటం సంస్థ
- లోకేశ్ ప్రత్యేక చొరవ... ఏపీకి ఐటీ, క్వాంటం కంపెనీల క్యూ.. వేల ఉద్యోగాలకు ఎస్ఐపీబీ గ్రీన్ సిగ్నల్
- ఐటీ మంత్రి నారా లోకేశ్ కృషితో ఏపీకి తరలివస్తున్న టెక్ కంపెనీలు
- విశాఖలో డెలాయిట్, ముత్తూట్ ఫిన్‌కార్ప్ భారీ ఆపరేషన్స్ సెంటర్ల ఏర్పాటు
- రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 9,000 కొత్త ఉద్యోగాల కల్పనకు మార్గం సుగమం




అమరావతి: ఆంధ్రప్రదేశ్‌ను టెక్నాలజీ రంగంలో అగ్రగామిగా నిలిపేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తున్నాయి. ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక చొరవ, నిరంతర కృషితో రాష్ట్రానికి దిగ్గజ ఐటీ, మిగతా 2 లో




## 'మొదట శివసేన.. తర్వాత ఎన్సీపీ.. ఇప్పుడు టీఎంసీ'.. ఎన్నికల సంఘంపై రాహుల్ షాకింగ్ కామెంట్స్

- టీఎంసీ పేరు, గుర్తును తాత్కాలికంగా ఫ్రీజ్ చేసిన ఎన్నికల సంఘం
- మమతా వర్గానికి రాహుల్ గాంధీ మద్దతు
- ఈసీ, బీజేపీపై రాహుల్ తీవ్ర ఆరోపణలు
- రెండు టీఎంసీ వర్గాల మధ్య పేరు, గుర్తుపై వివాదం
- కొత్త పేర్లు, గుర్తులు ఎంచుకోవాలని ఈసీ ఆదేశం

# విశాఖను గ్లోబల్ టెక్ హబ్‌గా మార్చడమే లక్ష్యంగా ప్రభుత్వ అడుగులు

### సీఎం చంద్రబాబు అధ్యక్షతన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు భేటీ

- విశాఖకు ఐటీ కళ.. చంద్రబాబు అధ్యక్షతన ఎస్ఐపీబీ కీలక నిర్ణయాలు
- రూ.526.25 కోట్ల విలువైన 10 ఐటీ ప్రాజెక్టులకు ఆమోదముద్ర
- విశాఖలో భారీ కేంద్రాలు ఏర్పాటు చేయనున్న డెలాయిట్, ముత్తూట్ ఫిన్‌కార్ప్



అమరావతి: ఆంధ్రప్రదేశ్‌ను ఐటీ, పారిశ్రామిక రంగాల్లో అగ్రగామిగా నిలిపే దిశగా ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన శుక్రవారం జరిగిన 21వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల మిగతా 2 లో

## బీఆర్ఎస్ నాయకులను టార్గెట్ చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

### మా ఆస్తులు తీసుకుని రూ. 1,000 కోట్లు ఇవ్వండి: రేవంత్ కు కేటీఆర్ సవాల్

- హైదరాబాద్ అభివృద్ధి కోసం రాత్రంబవళ్లు ప్రయత్నించామని వెల్లడి
- కేసీఆర్‌కు వెయ్యి ఎకరాల భూమి ఉందని అసత్య ప్రచారం చేశారని మండిపాటు



హైదరాబాద్: ఫార్ములా ఈ-రేస్ కేసులో నాంపల్లి ఏసీబీ ప్రత్యేక కోర్టు విచారణకు హాజరైన అనంతరం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో మిగతా 2 లో




## చెబితే నేనే భోజనం పెట్టి పొలం చూపించేవాడ్ని: హరీశ్ రావు

- సిద్దిపేటలో తన భూముల పరిశీలనపై హరీశ్ రావు స్పందన
- వస్తున్నారని చెబితే తానే ఏర్పాట్లు చేసేవాడినని వ్యాఖ్య
- 3,000 మంది పోలీసుల మోహరింపుపై ఆశ్చర్యం వ్యక్తం చేసిన హరీశ్
- తన ఆస్తులన్నీ అఫిడవిట్‌లో ప్రకటించానని స్పష్టీకరణ
- అబద్ధాలు ప్రచారం చేయొద్దని కాంగ్రెస్ నేతలకు హితవు

# సమస్యలను వేగంగా పరిశీలించి పరిష్కారం

### పరిష్కారానికి కార్యాచరణ రూపొందించనున్న కమిటీ

చైర్మన్‌గా సీసీఎల్ఏ కమిషనర్ లోకేశ్ కుమార్

ఇద్దరు ఉన్నతాధికారులు సభ్యులుగా నియామకం

భూ యజమానుల విజ్ఞప్తుల పరిశీలన

క్షేత్రస్థాయి సమస్యలపై కమిటీ దృష్టి



హైదరాబాద్: తెలంగాణలో సెక్షన్ 22-ఏ కింద నిషేధిత జాబితాలో ఉన్న భూముల సమస్యలకు చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ జాబితాకు సంబంధించి భూ యజమానులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, పెండింగ్ విజ్ఞప్తులను పరిశీలించి పరిష్కరించేందుకు హైలెవల్ కమిటీని ఏర్పాటు చేసింది. దీనిపై ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ముగ్గురు ఉన్నతాధికారులతో ఈ కమిటీని ఏర్పాటు చేశారు. సీసీఎల్ఏ కమిషనర్ లోకేశ్ కుమార్‌ను కమిటీ ఛైర్మన్‌గా నియమించారు. లా సెక్రటరీ పాపిరెడ్డి, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు సభ్యులుగా ఉంటారు. 22-ఏ నిషేధిత భూముల జాబితాలో ఉన్న అంశాలను కమిటీ సమగ్రంగా పరిశీలించనుంది. భూ యజమానులు ఎదుర్కొంటున్న క్షేత్రస్థాయి సమస్యలు, వారి విజ్ఞప్తులను పరిశీలించి పరిష్కారానికి అవసరమైన కార్యాచరణను రూపొందించనుంది. ఏళ్లుగా నిషేధిత జాబితాలో భూములు ఉండటంతో వాటి క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్ల విషయంలో పలువురు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీపై భూ యజమానుల్లో ఆశలు నెలకొన్నాయి. సమస్యలను వేగంగా పరిశీలించి పరిష్కారం చూపే దిశగా కమిటీ పనిచేయనుంది. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఈ నిర్ణయాన్ని ప్రకటించగా, తాజాగా ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది.

## సిద్దిపేట భూముల్లో కాషాయ జెండాలు పాతుతాం: కాంగ్రెస్, బీఆర్ఎస్‌లపై బండి సంజయ్ తీవ్ర ధ్వజం




- భూకబ్జా ఆరోపణలకు ఆధారాలు ఉంటే భూములు స్వాధీనం చేసుకోవాలన్న బండి సంజయ్
- కేసీఆర్ కు పుట్టుకతోనే వందల ఎకరాలు లేవనే విషయం అర్థమవుతోందని వ్యాఖ్య
- కేసీఆర్ గతమంతా అవినీతి, భూదందాలతో నిండిపోయిందని ఆరోపణ

స్ఫూర్తి పత్రిక
Voice of Truth



# విశాఖకు ఐటీ కళ.. అమరావతిలో క్వాంటం విప్లవం

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌ను టెక్నాలజీ రంగంలో అగ్రగామిగా నిలిపేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తున్నాయి. ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక చొరవ, నిరంతర కృషితో రాష్ట్రానికి దిగ్గజ ఐటీ, ఫ్యూచర్ టెక్నాలజీ కంపెనీలు భారీ ఎత్తున తరలివస్తున్నాయి. శుక్రవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన సచివాలయంలో జరిగిన రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశం ఇందుకు నిదర్శనంగా నిలిచింది. ఈ భేటీలో రూ.526.25 కోట్ల పెట్టుబడులతో 8,896 ఉద్యోగాలు కల్పించే 10 కీలక ఐటీ ప్రాజెక్టులకు, అలాగే క్వాంటం టెక్నాలజీ రంగంలో సంచలనం సృష్టించగల పలు ప్రాజెక్టులకు బోర్డు ఆమోదముద్ర వేసింది.

విశాఖకు ఐటీ కళ.. అమరావతిలో క్వాంటం విప్లవం

ఐటీ మంత్రిగా నారా లోకేశ్ బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి పెట్టుబడుల ఆకర్షణపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఆయన చొరవతో విశాఖపట్నం మరోసారి ఐటీ కార్యకలాపాలకు ప్రధాన కేంద్రంగా మారుతోంది. తాజాగా జరిగిన రాఘ్బాదీ భేటీలో అంతర్జాతీయ దిగ్గజ సంస్థ డెలాయిట్, విశాఖలో రూ.43.75 కోట్ల పెట్టుబడితో 2,500 సీట్ల సామర్థ్యంతో అత్యాధునిక ఆపరేషన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు ఆమోదం లభించింది. అదేవిధంగా, ప్రముఖ ఆర్థిక సేవల సంస్థ ముత్తూట్ ఫిన్‌కార్ప్ రూ.100 కోట్ల పెట్టుబడితో వైజాగ్‌లో "ఇంటిగ్రేటెడ్ హబ్ ఏఐ & టెక్ ట్రైనింగ్ సెంటర్"ను నెలకొల్పనుంది. ఈ కేంద్రం ద్వారా 2,400 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. మరోవైపు, రాజధాని అమరావతిని క్వాంటం టెక్నాలజీ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కీలక అడుగులు వేసింది. ఇందులో భాగంగా సృష్టి క్వాంటం ప్రైవేట్ లిమిటెడ్ రూ.2,700 కోట్ల భారీ పెట్టుబడితో క్వాంటం కంప్యూటింగ్ హార్డ్‌వేర్, నానోఫ్యాబ్రికేషన్ తయారీ సంస్థను ఏర్పాటు చేయనుంది. ఈ ఒక్క ప్రాజెక్టుతోనే దాదాపు 3,000 ఉద్యోగాలు రానున్నాయి. వీటితో పాటు క్వాంటం కోడాన్, అరోహాక్ టెక్నాలజీస్, ట్రైక్వాంటా లాబ్స్, ఫోటాన్‌కోర్ సిస్టమ్స్, వెరిడేటా హెల్త్ వంటి సంస్థలు కూడా అమరావతిలో తమ కార్యకలాపాలు ప్రారంభించనున్నాయి. ఈ కంపెనీల రాకతో క్వాంటం ఏఐ, డ్రగ్ డిస్కవరీ, ఫోటోనిక్స్ క్వాంటం రీసెర్చ్ వంటి అత్యాధునిక రంగాల్లో రాష్ట్ర యువతకు ఉజ్వల అవకాశాలు లభించనున్నాయి.

అన్ని ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యం

రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ నిర్ణయాలు స్పష్టం చేస్తున్నాయి. కడప జిల్లాలో ఏఐఎల్ డిక్సన్ టెక్నాలజీస్ సంస్థ రూ.70 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేయనున్న యూనిట్‌కు ప్రోత్సాహకాల గడువును పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ యూనిట్ ద్వారా 300 మందికి ఉద్యోగాలు లభిస్తాయి. తాజా నిర్ణయాలతో విశాఖపట్నం, అమరావతి, కడప వంటి ప్రాంతాల్లో వేల సంఖ్యలో ఉద్యోగాలు అందుబాటులోకి రానున్నాయి. లోకేశ్ నాయకత్వంలో ఐటీ రంగంలో వస్తున్న ఈ మార్పులు, రాష్ట్ర భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్నాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## సిద్దిపేట భూముల్లో కాషాయ జెండాలు పాతుతాం
## కాంగ్రెస్, బీఆర్ఎస్‌లపై బండి సంజయ్ తీవ్ర ధ్వజం

హైదరాబాద్: సిద్దిపేట భూముల వ్యవహారంపై తెలంగాణ రాజకీయం మరింత వేడెక్కింది. ఈ వివాదంపై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. భూకబ్జాలకు సంబంధించి నిజంగా ఆధారాలు ఉంటే వెంటనే ఆ భూములను స్వాధీనం చేసుకుని కేసీఆర్ కుటుంబంతో సహా బాధ్యులైన బీఆర్ఎస్ నేతలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి సవాల్ విసిరారు. ఆరు గ్యారంటీల అమలు నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే కాంగ్రెస్ ఈ డ్రామాలకు తెరలేపిందని, కేసీఆర్‌తో లాలూచీ పడేందుకే అసెంబ్లీలో ప్రత్యేక విచారణ కమిషన్ వేశారా అని ఎద్దేవా చేశారు. కేసీఆర్ గతమంతా అక్రమాలు, అవినీతి, భూదందాలతోనే నిండిపోయిందని బండి సంజయ్ ఆరోపించారు. ఎన్నికల అఫిడవిట్లను పరిశీలిస్తే కేసీఆర్ పుట్టుకతోనే వందల ఎకరాల యజమాని కాదనే విషయం స్పష్టమవుతుందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ ఒకే బాటలో పయనిస్తూ పరస్పర ఆరోపణలతో కాలయాపన చేస్తున్నాయని, ఈ భూదోపిడీపై త్వరలోనే బీజేపీ ఆధ్వర్యంలో 'దండయాత్ర' చేపడతామని హెచ్చరించారు. ఆక్రమిత భూముల్లో కాషాయ జెండాలు పాతి పేదలకు పంచుతామని స్పష్టం చేసిన బండి సంజయ్, భవిష్యత్తులో బీజేపీ అధికారంలోకి వస్తే రెండు పార్టీల అవినీతి, భూఆక్రమణలపై కఠిన విచారణ జరిపిస్తామని చెప్పారు.

## చెబితే నేనే భోజనం పెట్టి పొలం చూపించేవాడ్ని: హరీశ్ రావు

హైదరాబాద్: సిద్దిపేటలోని తన భూములను పరిశీలించేందుకు వస్తున్న కాంగ్రెస్ నాయకులకు బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు ఆసక్తికర ఆహ్వానం పలికారు. తనకు ముందే సమాచారం అందించి ఉంటే, తానే స్వయంగా అన్ని ఏర్పాట్లు చేసి, వారికి భోజన వసతి కల్పించి మరీ తన పొలాన్ని చూపించేవాడినని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం సిద్దిపేటలో జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. తన భూములను పరిశీలించేందుకు కాంగ్రెస్ నేతలు మూడు జిల్లాల నుంచి సుమారు 3,000 మంది పోలీసుల బందోబస్తుతో వస్తున్నారన్న వార్తలపై హరీశ్ రావు స్పందించారు. "ప్రేమ, ఆప్యాయతలకు, ఆతిథ్యానికి సిద్దిపేట పెట్టింది పేరు. అటువంటి ప్రాంతానికి రావడానికి ఇంత భయమెందుకు? ఇంత భారీ స్థాయిలో పోలీసు బలగాలతో రావాల్సిన అవసరం లేదు" అని ఆయన వ్యాఖ్యానించారు. తన జీవితం ఒక తెరిచిన పుస్తకమని స్పష్టం చేసిన హరీశ్ రావు, క్షేత్రస్థాయిలో వాస్తవాలను పరిశీలించి ప్రజలకు నిజాలు చెప్పాలని కాంగ్రెస్ నేతలను కోరారు. తాను ఎన్నడూ భూకబ్జాలకు పాల్పడలేదని, ప్రజాధనాన్ని దోచుకోలేదని స్పష్టం చేశారు. తన ఆస్తుల వివరాలన్నీ ఎన్నికల అఫిడవిట్‌లో స్పష్టంగా ఉన్నాయని, వాటిని గమనించిన ప్రజలు తనను ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించారని ఆయన గుర్తుచేశారు.

## బెంగాల్ ఉపపోరు: మమత వర్గం పార్టీకి
## 'ఫుట్‌బాల్ ప్లేయర్'.. రెబల్ వర్గానికి 'ఎన్వలప్'

బెంగాల్ : పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఉప ఎన్నికల నేపథ్యంలో, ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) పార్టీలోని రెండు వర్గాలకు భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) నూతన పేర్లను, ఎన్నికల చిహ్నాలను కేటాయించింది. పార్టీలో తలెత్తిన అంతర్గత వర్గపోరు కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. మమతా బెనర్జీ నేతృత్వంలోని వర్గానికి 'మమత ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్' అనే పేరును, 'ఫుట్‌బాల్ ప్లేయర్' గుర్తును ఈసీ కేటాయించింది. అదే సమయంలో, అరూప్ రాయ్ నేతృత్వంలోని అసమ్మతి వర్గానికి 'డెమోక్రటిక్ తృణమూల్ కాంగ్రెస్' అనే పేరును ఖరారు చేస్తూ, 'ఎన్వలప్' గుర్తును కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అంతకుముందు సెప్టెంబర్ 17న, టీఎంసీ అసలు పేరును, చిహ్నాన్ని ఈ రెండు వర్గాలు ఉపయోగించకుండా ఎన్నికల సంఘం తాత్కాలిక నిషేధం విధించింది. పశ్చిమ బెంగాల్‌లోని నందిగ్రామ్, రెజీనగర్ నియోజకవర్గాలకు అక్టోబర్ 6న జరగనున్న ఉప ఎన్నికల దృష్ట్యా ఈ చర్యలు చేపట్టింది. దీంతో రెండు వర్గాలు తమకు నచ్చిన పేర్లు, గుర్తుల జాబితాను ఈసీకి సమర్పించగా, వాటిని పరిశీలించిన అనంతరం ఎన్నికల సంఘం తాజాగా ఈ కేటాయింపులు చేసింది.

## విశాఖను గ్లోబల్ టెక్ హబ్‌గా
## మార్చడమే లక్ష్యంగా ప్రభుత్వ అడుగులు

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌ను ఐటీ, పారిశ్రామిక రంగాల్లో అగ్రగామిగా నిలిపే దిశగా ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన శుక్రవారం జరిగిన 21వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు (రాఘ్బాదీ) సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ భేటీలో రాష్ట్రానికి రూ.526.25 కోట్ల పెట్టుబడులు తీసుకువచ్చే 10 ఐటీ ప్రాజెక్టులకు ఆమోదముద్ర వేశారు. ఈ ప్రాజెక్టులన్నీ ప్రధానంగా విశాఖపట్నం కేంద్రంగా రానుండటంతో, నగరం త్వరలో గ్లోబల్ టెక్ హబ్‌గా మారనుంది. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక చొరవతో దిగ్గజ ఐటీ కంపెనీలు ఏపీ వైపు చూస్తున్నాయని, దీని ఫలితంగానే తాజా పెట్టుబడులు వస్తున్నాయని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఈ సమావేశంలో ఆమోదం పొందిన ప్రాజెక్టుల్లో రెండు భారీ సంస్థలు విశాఖలో తమ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నాయి. ప్రముఖ గ్లోబల్ కన్సల్టింగ్ సంస్థ డెలాయిట్, రూ.43.75 కోట్ల పెట్టుబడితో 2,500 సీట్ల సామర్థ్యంతో అత్యాధునిక ఆపరేషన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చింది. అదేవిధంగా, ప్రముఖ ఫైనాన్స్ సంస్థ ముత్తూట్ ఫిన్‌కార్ప్ రూ.100 కోట్ల పెట్టుబడితో ఐటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కార్యకలాపాల కోసం 2,400 సీట్లతో మరో భారీ కేంద్రాన్ని నెలకొల్పనుంది. ఈ రెండు కంపెనీల రాకతోనే దాదాపు 5,000 మందికి ప్రత్యక్షంగా ఉపాధి లభించనుంది. మొత్తం 10 ఐటీ ప్రాజెక్టులకు బోర్డు ఆమోదం తెలపగా, వీటిలో 7 ప్రాజెక్టులు అత్యాధునికమైన క్వాంటం టెక్నాలజీకి సంబంధించినవి కావడం విశేషం. ఈ నిర్ణయాలతో విశాఖపట్నం ఐటీ స్వరూపం పూర్తిగా మారిపోనుందని, యువతకు భారీ ఎత్తున ఉద్యోగావకాశాలు లభిస్తాయని ప్రభుత్వం భావిస్తోంది.

## దుగరాజపట్నంలో భారీ షిప్‌యార్డ్..
## రూ.15 వేల కోట్ల పెట్టుబడి!

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో షిప్‌బిల్డింగ్ రంగానికి భారీ ఊతం లభించనుంది. దుగరాజపట్నంలో గ్రీన్‌ఫీల్డ్ షిప్‌యార్డ్ ఏర్పాటు చేసేందుకు 'మజగావ్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్' (ఎండీఎల్)తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో సచివాలయంలో ఎండీఎల్, 'నేషనల్ షిప్‌బిల్డింగ్ అండ్ హెవీ ఇండస్ట్రీస్ పార్క్-ఏపీ' (ఎన్ఎస్‌హెచ్ఐపీ-ఏపీ) మధ్య ఎంవోయూ జరిగింది. వచ్చే ఐదేళ్లలో ఈ ప్రాజెక్టుపై ఎండీఎల్ సుమారు రూ.15 వేల కోట్లు పెట్టుబడి పెట్టనుంది. దీని ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 45 వేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. షిప్‌బిల్డింగ్‌తో పాటు మెరైన్ ఇంజినీరింగ్, లాజిస్టిక్స్, సర్వీసులు, అనుబంధ పరిశ్రమలు కూడా అభివృద్ధి చెందే అవకాశం ఉంది. ప్రతిపాదిత షిప్‌యార్డ్ ఏటా 12 లక్షల గ్రాస్ టన్నుల నౌకల నిర్మాణ సామర్థ్యంతో ఏర్పాటు కానుంది. ట్యాంకర్లు, బల్క్ క్యారియర్లు, కంటైనర్ నౌకలు, ఎల్ఎన్‌జీ క్యారియర్లు, భారీ ప్రత్యేక నౌకలను ఇక్కడ నిర్మించేలా ప్రణాళిక రూపొందించారు. అవసరాన్ని బట్టి భవిష్యత్‌లో సామర్థ్యాన్ని మరింత పెంచుకునే అవకాశం ఉంటుంది. దుగరాజపట్నంలో షిప్‌బిల్డింగ్-కమ్-పోర్ట్ క్లస్టర్‌ను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. టెక్నో-ఎకనామిక్ ఫీజిబిలిటీ రిపోర్ట్ ప్రకారం షిప్‌బిల్డింగ్, షిప్ రిపేర్ యార్డ్‌కు సుమారు రూ.29,254 కోట్లు, పోర్టు అభివృద్ధికి రూ.9,513 కోట్ల వ్యయం అవుతుందని అంచనా.

## దశాబ్దాల నిరీక్షణకు తెర.. విశాఖలో
## 28,445 కుటుంబాలకు ఇంటి పట్టాలు

అమరావతి: దశాబ్దాలుగా సొంత ఇంటిపై హక్కు కోసం ఎదురుచూస్తున్న వేలాది కుటుంబాలకు పట్టాలు అందించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. సెప్టెంబర్ 19న విశాఖపట్నంలో జరిగే కార్యక్రమంలో 28,445 కుటుంబాలకు ఇంటి పట్టాలు అందించనున్నట్లు సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుని ఏళ్లుగా నివసిస్తున్న పేద కుటుంబాలకు ఆయా స్థలాలను క్రమబద్ధీకరించి పూర్తి హక్కులు కల్పిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. 11 మండలాల పరిధిలో 19,33,853 చదరపు గజాల స్థలాలను క్రమబద్ధీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇది కేవలం పట్టాల పంపిణీ కార్యక్రమం కాదని.. ఇళ్లపై కుటుంబాలకు చట్టబద్ధమైన హక్కు కల్పించే కీలక ఘట్టమని చంద్రబాబు అన్నారు. పట్టా ద్వారా కుటుంబాలకు ఆస్తి, భవిష్యత్తుకు భద్రత, పిల్లలకు వారసత్వ హక్కు లభిస్తాయని పేర్కొన్నారు. ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణతో ఏళ్లుగా హక్కుల కోసం ఎదురుచూస్తున్న కుటుంబాలకు ఊరట లభించనుంది. సెప్టెంబర్ 19న విశాఖలో చంద్రబాబు లబ్ధిదారులకు పట్టాలు, కన్వేయన్స్ డీడ్లు అందించనున్నట్లు జిల్లా అధికారులు తెలిపారు. విశాఖను ప్రపంచస్థాయి నగరంగా అభివృద్ధి చేస్తూనే సామాన్య కుటుంబాలకు భరోసా కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చంద్రబాబు తన పోస్టులో పేర్కొన్నారు.

## రాయలసీమ పౌరుషం ఏమిటో చూపిస్తాం
### విజయసాయిరెడ్డి

అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కొత్త శకం ప్రారంభం కాబోతోందని, రాయలసీమ ప్రాంత అభివృద్ధి, స్థానిక ప్రజల ఆత్మగౌరవానికి ప్రతిరూపంగా త్వరలోనే నూతన ప్రాంతీయ రాజకీయ పార్టీ రాబోతోందని మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి వెల్లడించారు. అనంతపురంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన, టీడీపీ, వైసీపీ రెండూ కుటుంబ రాజకీయాలకే ప్రాధాన్యమిచ్చాయని... అసలైన రాయలసీమ పౌరుషాన్ని, ప్రాంతీయ సంక్షేమాన్ని కాపాడే బాధ్యతను తమ నూతన పార్టీ తీసుకుంటుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇన్ని రోజులవుతున్నా రెడ్డి కార్పొరేషన్‌ను ఎందుకు పునరుద్ధరించలేదని ఆయన నిలదీశారు. రాష్ట్ర విభజన అనంతరం సీమ ప్రాంతానికే చెందిన నాయకులు ముఖ్యమంత్రులుగా పనిచేసినప్పటికీ, రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులు, అభివృద్ధి పనులను నిర్లక్ష్యం చేశారని దుయ్యబట్టారు. చంద్రబాబు, జగన్ కుటుంబాలు కేవలం ఎన్నికల సమయంలోనే రాజకీయం చేస్తూ, సీమ నుంచి ప్రజల వలసలకు ప్రధాన కారణమయ్యారని ఆరోపించారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే యువత భాగస్వామ్యంతో సీమను తిరిగి 'రతనాల సీమ'గా మారుస్తామని... అన్ని కులాలు, మతాల సంక్షేమానికి కట్టుబడి ఉంటామని అన్నారు.

## బీఆర్ఎస్ నాయకులను
## టార్గెట్ చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

హైదరాబాద్: ఫార్ములా ఈ-రేస్ కేసులో నాంపల్లి ఏసీబీ ప్రత్యేక కోర్టు విచారణకు హాజరైన అనంతరం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఎన్నికల మేనిఫెస్టో హామీలను అమలు చేయడం వదిలేసి, బీఆర్ఎస్ నాయకులను వ్యక్తిగతంగా టార్గెట్ చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ఏకైక లక్ష్యంగా మారిందని ఆయన ఆరోపించారు. కేసీఆర్ కుటుంబం రూ. లక్ష కోట్లు కొల్లగొట్టిందని సీఎం రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణలను ప్రస్తావిస్తూ కేటీఆర్ ఒక సంచలన ఆఫర్ విసిరారు. "మా కుటుంబ ఆస్తులన్నింటినీ ప్రభుత్వమే తీసుకుని, దానికి ప్రతిఫలంగా మాకు రూ. వెయ్యి కోట్లు ఇస్తే ఎక్కడ సంతకం పెట్టమన్నా పెడతాను. మిగిలిన రూ. 99,000 కోట్లతో ప్రజలకు ఇచ్చిన హామీలను, సంక్షేమ పథకాలను అమలు చేయండి" అని సవాల్ చేశారు. హైదరాబాద్ అభివృద్ధి కోసం, పెట్టుబడులను ఆకర్షించేందుకు తాము రాత్రింబవళ్లు ప్రయత్నిస్తే, తమపై అక్రమ కేసులు బనాయించారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే భూకేటాయింపుల ఆరోపణలపై మాట్లాడుతుండగా, గతంలో కేసీఆర్‌కు వెయ్యి ఎకరాల భూమి ఉందంటూ అసత్య ప్రచారం చేశారని, కానీ ఇటీవల అసెంబ్లీ వేదికగా రేవంత్ రెడ్డి స్వయంగా కేసీఆర్‌కు ఉన్నది కేవలం 67 ఎకరాలేనని ఒప్పుకున్నారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని అక్రమ కేసులు పెట్టినా బెదిరేది లేదని, న్యాయపరంగానూ, రాజకీయంగానూ ఈ వేధింపులను ఎదుర్కొంటామని కేటీఆర్ స్పష్టం చేశారు.

## 22ఏ భూములపై సర్కార్ కీలక నిర్ణయం..
## సమస్యలకు చెక్ పెట్టేలా హైలెవల్ కమిటీ!

హైదరాబాద్: తెలంగాణలో సెక్షన్ 22-ఏ కింద నిషేధిత జాబితాలో ఉన్న భూముల సమస్యలకు చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ జాబితాకు సంబంధించి భూ యజమానులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, పెండింగ్ విజ్ఞప్తులను పరిశీలించి పరిష్కరించేందుకు హైలెవల్ కమిటీని ఏర్పాటు చేసింది. దీనిపై ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ముగ్గురు ఉన్నతాధికారులతో ఈ కమిటీని ఏర్పాటు చేశారు. సీసీఎల్ఏ కమిషనర్ లోకేశ్ కుమార్‌ను కమిటీ ఛైర్మన్‌గా నియమించారు. లా సెక్రటరీ పాపిరెడ్డి, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు సభ్యులుగా ఉంటారు. 22-ఏ నిషేధిత భూముల జాబితాలో ఉన్న అంశాలను కమిటీ సమగ్రంగా పరిశీలించనుంది. భూ యజమానులు ఎదుర్కొంటున్న క్షేత్రస్థాయి సమస్యలు, వారి విజ్ఞప్తులను పరిశీలించి పరిష్కారానికి అవసరమైన కార్యాచరణను రూపొందించనుంది. ఏళ్లుగా నిషేధిత జాబితాలో భూములు ఉండటంతో వాటి క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్ల విషయంలో పలువురు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీపై భూ యజమానుల్లో ఆశలు నెలకొన్నాయి. సమస్యలను వేగంగా పరిశీలించి పరిష్కారం చూపే దిశగా కమిటీ పనిచేయనుంది. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఈ నిర్ణయాన్ని ప్రకటించగా, తాజాగా ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది.

## 'మొదట శివసేన.. తర్వాత ఎన్సీపీ.. ఇప్పుడు టీఎంసీ'..
## ఎన్నికల సంఘంపై రాహుల్ షాకింగ్ కామెంట్స్



ఢిల్లీ: పశ్చిమబెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) పేరు, ఎన్నికల గుర్తును ఎన్నికల సంఘం తాత్కాలికంగా నిలిపివేయడంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ వర్గానికి మద్దతు ప్రకటించిన ఆయన.. బీజేపీ, ఎన్నికల సంఘం కలిసి ప్రతిపక్ష పార్టీలను చీల్చేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. 'మొదట శివసేన.. తర్వాత ఎన్సీపీ.. ఇప్పుడు తృణమూల్ కాంగ్రెస్' అంటూ రాహుల్ గాంధీ సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ప్రతిపక్ష పార్టీని చీల్చి, ఆ తర్వాత దాని ఎన్నికల గుర్తును లాక్కునే విధంగా ఒకే తరహా పరిణామాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. 'ఓట్ల చోరీ, ప్రభుత్వం చోరీ.. ఇప్పుడు పార్టీ చోరీ కూడా' అంటూ విమర్శలు చేశారు. అయితే ఎన్నికల సంఘం మాత్రం టీఎంసీలో రెండు వర్గాలు పార్టీపై హక్కు కోరుతున్న నేపథ్యంలోనే ఈ మధ్యంతర నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. మమతా బెనర్జీ వర్గం, మరో వర్గం ఇకపై 'ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్' పేరు, 'ఫ్లవర్స్ అండ్ గ్రాస్' గుర్తును ఉపయోగించకూడదని ఆదేశించింది. రెండు వర్గాలు కొత్త పేర్లు, గుర్తుల నుంచి తమకు కావాల్సిన వాటిని ఎంచుకోవాలని సూచించింది. ఈ నిర్ణయం తుది తీర్పు కాదని, వివాదంపై తుది నిర్ణయం తర్వాత తీసుకోనున్నట్లు ఈసీ స్పష్టం చేసింది. అక్టోబర్ 6న నందిగ్రామ్, రెజినగర్ అసెంబ్లీ స్థానాలకు ఉపఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల నేపథ్యంలోనే ప్రస్తుత టీఎంసీ పేరు, గుర్తుపై తాత్కాలిక ఆంక్షలు అమల్లోకి వచ్చాయి. ఇదే సమయంలో మమతా వర్గం ప్రత్యామ్నాయ పేరు, గుర్తు ఎంపికలను ఈసీకి పంపింది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ కూడా ఈసీ నిర్ణయాన్ని తప్పుబట్టారు. టీఎంసీని బలహీనపరిచే ప్రయత్నంగా ఆయన అభివర్ణించారు. బీజేపీకి ఈసీ అనుకూలంగా వ్యవహరిస్తోందని ఆరోపణలు చేశారు. ఇవన్నీ కాంగ్రెస్ నేతల ఆరోపణలేనని, ఎన్నికల సంఘం మాత్రం తన మధ్యంతర ఉత్తర్వుల్లో రెండు వర్గాల హక్కులను సమానంగా ఉంచేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది.

## పాకిస్థాన్‌లో మసీదుపై ఆత్మాహుతి దాడి..
## 15 మంది మృతి



ఢిల్లీ: పాకిస్థాన్‌లో ఉగ్రవాదులు మరోసారి రక్తపాతం సృష్టించారు. వాయవ్య పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్, కోహట్ నగరంలో శుక్రవారం ఓ మసీదును లక్ష్యంగా చేసుకుని ఆత్మాహుతి దాడికి పాల్పడ్డారు. ఈ ఘోర ఘటనలో ఐదుగురు పోలీసు అధికారులతో సహా కనీసం 15 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 56 మంది తీవ్రంగా గాయపడ్డారు. పోలీసు కార్యాలయాల సముదాయానికి సమీపంలో ఉన్న మసీదులోకి ఓ ఉగ్రవాది పేలుడు పదార్థాలతో కూడిన వాహనంతో దూసుకెళ్లాడు. ఈ భారీ పేలుడు ధాటికి మసీదు కుప్పకూలగా, సమీపంలోని పోలీసు భవనం ప్రహరీ గోడ సైతం నేలమట్టమైంది. అనంతరం, తుపాకులతో సాయుధులైన మరో ఇద్దరు ఉగ్రవాదులు పోలీసు ప్రాంగణంలోకి చొరబడేందుకు ప్రయత్నించారు. అయితే, అప్రమత్తమైన భద్రతా సిబ్బంది వెంటనే ఎదురుకాల్పులు జరపడంతో ఓ ఉగ్రవాది హతమయ్యాడు. గాయపడిన వారిలో అధికశాతం ప్రార్థనల కోసం వచ్చినవారేనని, వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉందని అధికారులు వెల్లడించారు. ఈ కిరాతక దాడిని పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ తీవ్రంగా ఖండించారు. మృతుల కుటుంబాలకు ఆయన తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆ దేశ అధ్యక్షుడు ఆకాంక్షించారు. పొరుగునే ఉన్న హంగూ జిల్లాలో గురువారం జరిగిన బాంబు దాడిలో ఆరుగురు సైనికులు మరణించిన మరుసటి రోజే ఈ దారుణం జరగడం కలకలం రేపుతోంది. ఇటీవల కాలంలో పాకిస్థానీ తాలిబన్లు (టీటీపీ) భద్రతా దళాలు, పౌరులను లక్ష్యంగా చేసుకుని దాడులను ముమ్మరం చేశారు. కాగా, తాజా దాడికి సంబంధించి ఇప్పటివరకు ఏ ఉగ్రవాద సంస్థా బాధ్యత ప్రకటించలేదు.

## వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనడంలో
## కేంద్ర ప్రభుత్వం అవసరమైన సహకారం అందించాలి



హైదరాబాద్: ఎల్‌నినో ప్రభావం కారణంగా రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనడంలో కేంద్ర ప్రభుత్వం అవసరమైన సహకారం అందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్‌ని కోరారు. దక్షిణ రాష్ట్రాల వ్యవసాయ సదస్సులో పాల్గొనడానికి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ గారు హైదరాబాద్ వచ్చిన సందర్భంగా ముఖ్యమంత్రి వారిని కలిసి వర్షాభావం, రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను కేంద్ర మంత్రికి వివరించారు. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు గారు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రానికి అవసరమైన సహకారం అందించాలని కోరుతూ వివరాలతో వినతిపత్రాన్ని అందజేశారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వ్యవసాయ రంగంలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగిందని తెలిపారు. అలాగే, తాగునీరు, విద్యుత్ కొరత తలెత్తకుండా రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసిందని వివరించారు. ఎల్‌నినో నేపథ్యంలో రాష్ట్రంలో ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను ప్రోత్సహిస్తున్నామని ముఖ్యమంత్రి చెప్పారు. పంటల మార్పిడిపై రైతులను ప్రోత్సహించాల్సిన అవసరాన్ని గుర్తించి రాష్ట్రానికి అవసరమైన సహకారాన్ని అందించాలని కోరారు. ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలన్న ఆలోచనతో 250 ఎకరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో పండ్లు, కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేస్తున్నామని ఈ సందర్భంగా చెప్పారు. రాపీశ్+ పథకంలో భాగంగా మొదటి విడతగా రాష్ట్రానికి 2 లక్షల ఇండ్లను కేటాయించిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావిస్తూ అందుకు కేంద్ర మంత్రి గారికి ముఖ్యమంత్రి గారు కృతజ్ఞతలు చెప్పారు. రాష్ట్రంలో 11,56,915 అర్హులైన గ్రామీణ కుటుంబాలకు ఇండ్లు మంజూరు చేయాలని గత జూలైలో కేంద్రమంత్రికి ఢిల్లీలో వినతిపత్రం అందించిన విషయాన్ని ప్రస్తావించారు. రాష్ట్రంలో డిమాండ్‌కు అనుగుణంగా మిగిలిన 9.56 లక్షల ఇండ్లను కేటాయించాలని ఈ సందర్భంగా కేంద్రమంత్రి గారిని కోరారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పేదలకు రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యాన్ని అందిస్తున్నామని, అలాగే సన్న వడ్లకు రూ. 500 బోనస్‌ను అందించి ప్రోత్సహిస్తున్నామని వివరించారు.

## ఎల్‌నినో నివారణ చర్యల్లో ప్రభుత్వం విఫలం




అమరావతి: రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో కాదు, మ్యాన్ మేడ్ కరవు నెలకొందని మాజీ ముఖ్యమంత్రి జగన్ విమర్శించారు. ఎల్‌నినోతో కరవు పరిస్థితులు నెలకొంటాయని ఫిబ్రవరి 4నే చెప్పిన చంద్రబాబు.. తర్వాత కరవు నివారణ చర్యల్లో చేసింది సున్నా అని ఆరోపించారు. జూన్ నుంచి వరుస నెలల్లో లోటు వర్షపాతం ఉంటే కరవు మండలాలను ఇప్పటి వరకూ ఎందుకు ప్రకటించలేదని ప్రశ్నించారు. జగన్ తన క్యాంపు కార్యాలయం నుంచి వైకాపా ప్రాంతీయ సమన్వయకర్తలు, జిల్లాల అధ్యక్షులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. 'నీళ్లిస్తున్నాం సాగు చేసుకోండని జులై 11న సీఎం, ఆయన మంత్రులు చెప్పడం వల్ల రైతులు సాగు ప్రారంభించారు. 56.4 లక్షల ఎకరాల్లో రైతులు పంట నష్టపోయారు. 2023 ఖరీఫ్ పంట బీమాకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కట్టాల్సిన రూ1,400 కోట్లను 2024 జూన్‌లో చంద్రబాబు కట్టి ఉంటే రైతులకు సుమారు రూ.3 వేల కోట్ల మేలు జరిగేది. కానీ కట్టలేదు' అని పేర్కొన్నారు.

పోలవరంలో రాజీపడ్డారు

'పోలవరంలో 45.72 మీటర్ల ఎత్తు వరకు అయితేనే 194 టీఎంసీల నీటిని నిల్వ చేయగలరు. దాన్ని కేంద్రం 41.15 మీటర్లకు కుదిస్తే చంద్రబాబు రాజీపడ్డారు. ఫలితంగా 120 టీఎంసీల నీటిని నిల్వ చేసే అవకాశాన్ని, ఈ ప్రాజెక్టుకు కేంద్రం భరించాల్సిన రూ.60 వేల కోట్లలో సుమారు రూ.30 వేల కోట్లను వదులుకున్నారు. పురుషోత్తపట్నం, పుష్కర ఎత్తిపోతల ద్వారా నీటిని తీసుకువెళ్లి పోలవరం నుంచి ఉత్తరాంధ్రకు నీటిని తీసుకువచ్చినట్లు చంద్రబాబు డ్రామా చేశారు' అని జగన్ విమర్శించారు. కరవు మండలాలను వెంటనే ప్రకటించాలని, ఉచిత పంటల బీమాను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

## కేసీఆర్, హరీశ్ రావు భూములపై
## పూర్తి ఆధారాలు ఉన్నాయి: పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



హైదరాబాద్: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఓవర్ లాప్ ల్యాండ్‌లో ఉన్నారని, సర్వే అనంతరం వ్యత్యాసాలు బయటపడితే ఆయనకు నోటీసులు ఇస్తామని తెలంగాణ రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. 2004 ఎన్నికల అఫిడవిట్‌లో కేవలం ఒక ఎకరం భూమి మాత్రమే ఉందని చూపించిన కేసీఆర్‌కు వందల కోట్ల విలువైన భూములు ఎక్కడి నుంచి వచ్చాయని నిలదీశారు. తమ భూముల కోసం వచ్చిన దళితులను నిలబెట్టి పసుపు నీళ్లు చల్లించిన చరిత్ర కేసీఆర్ కుటుంబానిదని తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ మంత్రి హరీశ్ రావుపై కూడా పొంగులేటి కీలక వ్యాఖ్యలు చేశారు. వట్టినాగులపల్లి భూమిపై హరీశ్ రావు మాటలు మార్చుతున్నారని, ట్రస్ట్ పేరిట భూములను దారి మళ్లించారని ఆరోపించారు. ఇరిగేషన్ మంత్రిగా ఉన్న సమయంలో రంగనాయక్ సాగర్ ఎఫ్టీఎల్ పరిధిలో ఉన్న 13 ఎకరాల భూమిని డిలీట్ చేయించి, అతి తక్కువ ధరకు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆరోపించారు. అంతేకాకుండా రూ. 5.40 కోట్ల ప్రభుత్వ నిధులతో ఆ ల్యాండ్‌కు ప్రయోజనం చేకూరేలా రోడ్డు వేయించుకున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తమ వ్యాపార కుటుంబాలపై మాట్లాడే అర్హత బీఆర్ఎస్ నేతలకు లేదన్న మంత్రి, ఈ భూ అక్రమాలకు సహకరించిన అధికారులు ఎంతటివారైనా సరే వారిపై కఠిన చర్యలు ఉంటాయని, సిద్దిపేటలో ఆక్రమణకు గురైన భూముల్లో 'ఇందిరమ్మ టవర్స్' నిర్మిస్తామని స్పష్టం చేశారు.

## డోన్ లో యువత భవిష్యత్తుకు భరోసా కార్యక్రమం

### విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించిన ఎంపీ బైరెడ్డి శబరి...



డోన్ (స్ఫూర్తి పత్రిక) సెప్టెంబర్ 19 : నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు శ్రీమతి బైరెడ్డి శబరి డోన్ కు విచ్చేసి జీవీఆర్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ విద్యార్థులతో, సాయి ఫంక్షన్ హాల్ నందు డిగ్రీ విద్యార్థులతో కలిసి "యువత భవిష్యత్తుకు భరోసా" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా యూట్యూబ్ గణేష్, నంద్యాల పార్లమెంటు సభ్యురాలు బైరెడ్డి శబరి ను మర్యాదగా పూర్వకంగా కలిసి మాట్లాడారు.ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,మంత్రి నారా లోకేష్ యువత భవిష్యత్తు కోసం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.రాయలసీమను కరువు ప్రాంతం, వలస ప్రాంతం అని చెప్పుకునే రోజులు పోయాయని, భవిష్యత్తులో రాయలసీమలో ప్రతి ఇంట్లో ఒక సాఫ్ట్ వేర్ ఇంజనీర్, ఒక డాక్టర్ ఉంటారని, దానికి కావలసిన అన్ని చర్యలు ప్రభుత్వం తీసుకుంటుందని తెలిపారు."విద్యార్థులు చేయవలసిన ముఖ్యమైన పని బాగా చదవడం, స్కిల్ డెవలప్మెంట్ నేర్చుకోవడం, క్యారెక్టర్ కాపాడుకోవడం. ఇవి మీతో ఉంటే మీరు ఎక్కడున్నా రాజులా జీవిస్తారు" అని విద్యార్థులకు సూచించారు.ప్రధాని నరేంద్ర మోడీ, సీఎం చంద్రబాబు నాయుడు , స్థానిక ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి నిరంతరం యువత అభివృద్ధి కోసం పనిచేస్తున్నారని తెలిపారు. ఎన్డీఏ కూటమిని గెలిపించిన యువతకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బిజెపి ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి యూట్యూబ్ గణేష్, భరణి రమేష్, కూటమి నాయకులు, కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ ప్రజల సహకారంతో వైభవంగా విఘ్నేశ్వర ఉత్సవాలు

### స్థానిక యువత, కమిటీ సభ్యుల ధన్యవాదాలు



నందలూరు (స్ఫూర్తి పత్రిక) సెప్టెంబర్ 19 : నందలూరు మండలం నాగిరెడ్డిపల్లి గ్రామంలోని వివేకా నంద నగర్‌లో వేంచేసిన శ్రీశ్రీశ్రీ విఘ్నేశ్వర స్వామివారి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, అత్యంత వైభవంగా ముగిశాయి. ఈ సందర్భంగా విఘ్నేశ్వర ఉత్సవ కమిటీ సభ్యులు స్థానిక యువత నాగిరెడ్డిపల్లి గ్రామ ప్రజలందరికీ హృదయపూర్వక ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన కబడ్డీ పోటీలు, మహిళల ముగ్గుల పోటీలు అలానే విశేష అన్నదాన ప్రసాద వితరణ కార్యక్రమాల్లో గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని, విశేష ఆధరణ అందించి అన్ని కార్యక్రమాలను దిగ్విజయం చేశారని కమిటీ ప్రతినిధులు కొనియాడారు. భక్తులంతా ఒక్కుమ్మడిగా పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారని తెలిపారు.రాబోయే ప్రతి సంవత్సరం కూడా ఇదే విధంగా గ్రామ ప్రజల సహకారంతో, ఇంకా అంగరంగ వైభవంగా, మరింత భక్తిశ్రద్ధలతో వినాయక చవితి వేడుకలను నిర్వహిస్తామని ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు అలానే యువత పునరుద్ఘాటించారు.

## గణనాధుని మండపంలో ఉభయం అలాగే పూజద కార్యక్రమం ఏర్పాటు చేసిన తాటి సుబ్బరాయుడు కుటుంబం.





నందలూరు (స్ఫూర్తి పత్రిక) సెప్టెంబర్ 19 : నందలూరు మండలం నాగిరెడ్డి పల్లి మేజర్ గ్రామ పంచాయతీ అరవ పల్లి,ఆర్ఎస్ రోడ్డునందు వినాయక నగర్ లో శుక్రవారం ఉదయం ఉభయ దారులు తాటి సుబ్బరాయుడు యాదవ్ తాటి లక్ష్మీదేవి ఎక్స్ ఎంపీటీసీ వారి కుమారుడు పూజా కార్యక్రమం నిర్వహించడం జరిగినది భక్తులు కేశగాని మురళీకృష్ణ యాదవ్, రాధాకుమారి గంధం గంగాధర్ మాడ పోతుల రాము మొదలగు మహిళలు పాల్గొనడం జరిగినది అలానే నందలూరు మండలంలో అనేక గ్రామాలలో వినాయక విగ్రహాలను అనేకమైనటి విగ్రహాలను ఏర్పాటు చేయడం జరిగినది అయితే నందలూరు మండలం నాగిరెడ్డిపల్లి ఆర్ఎస్ రోడ్డు వినాయక నగర్ నందు ప్రత్యేకమైన ఆకర్షణలో విగ్రహము మండపములో నిర్మించడం చూడదగ్గ ఆహ్లాదకరంగా భక్తులు ఎల్లారును ఆకర్షించడం సంతోషకరాన్ని కమిటీ సభ్యులకు విచ్చేసిన చుట్టుపక్క ప్రాంత ప్రజలకు ఆనందాన్ని నింపింది అన్ని నిర్వాహకులు అయినటువంటి తాటి సుబ్బరాయుడు పత్రిక విలేకరులకు తెలియజేశారు.

## రాజంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహణ

### విద్యార్థిని విద్యార్థులతో ప్రతిజ్ఞ





నందలూరు (స్ఫూర్తి పత్రిక) సెప్టెంబర్ 19 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మ కంగా చేపట్టిన స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రాజంపేటలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం కళాశాల యన్. యస్. యస్. ఆఫీసర్ కె.వెంకట నరసయ్య అధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా.పురు షోత్తమ్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం గురించి వివరించారు. ప్లాస్టిక్ పునర్వినియోగం, పునరుత్పత్తి గురించి కళాశాల విద్యార్థులకు వివరించారు. సైన్సు విద్యార్థులు తరగతి గదులు, ప్రయోగ శాలలను శుభ్ర పరిచారు. కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాల వైద్యులు డా.వికాస్, డా.లక్ష్మి ప్రసన్న, సూపర్ వైజర్ విజయలక్ష్మి, సిబ్బంది యస్.చాన్ భాష, వి,పార్వతి, శివయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## గుత్తి పెన్షన్ భవనంలో ఘనంగా డాక్టర్. బోయి భీమన్న 115 వ జయంతి కార్యక్రమం.




గుత్తి (స్ఫూర్తి పత్రిక) సెప్టెంబర్ 19 : అనంతపురం జిల్లా గుత్తి పట్టణంలో ని ఫుట్బాల్ మైదానంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల భవనంలో ప్రెసిడెంట్ అబూబాకర్, కోశాధికారి జెన్నే కుల్లాయిబాబు ఆధ్వర్యంలో బోయి భీమన్న 115 వ జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కోశాధికారి జెన్నే కుల్లాయిబాబు ,సెక్రెటరీ రామ్ మోహన్ బోయి భీమన్న చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు.కోశాధికారి జెన్నే కుల్లాయిబాబు మాట్లాడుతూ బోయి భీమన్న తూర్పుగోదావరి జిల్లా మామిడి కుదురు గ్రామంలో ఓ హరిజన కుటుంబం లో పుట్టారు.వీరు కేంద్ర సాహిత్య అకాడమి అవార్డ్ ,పద్మభూషణ్ తో పాటు ఎన్నో గౌరవ ,సన్మానాలు అందు కున్న కవి బోయి భీమన్న. ఆధునిక తెలుగు సాహిత్యంలో తనకంటూ సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్న కళా ప్రపూర్ణుడు.పద్యం, గద్యం, గేయం,నాటకం, నాటిక,వచన కవిత లాంటి విభిన్న సాహితీ ప్రక్రియ ల్లో 70 కి పైగా రచనలను వెలువరించిన బోయి భీమన్న.వీరిని ఈరోజు జయంతి సందర్భంగా స్మరించుకుందా ము అని కోశాధికారి జెన్నే కుల్లాయిబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ అబూబాకర్, కోశాధికారి జెన్నే కుల్లాయిబాబు, సెక్రెటరీ రామ్ మోహన్,షైక్షా వలి,నారాయణ రెడ్డి, శామ్యూల్,లక్ష్మి నారాయణ రెడ్డి, హస్సన్ అహమ్మద్, నారాయణ శెట్టి,నరసింహులు, డేనియల్, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

## నేడే బనగానపల్లె పట్టణంలో నూతనంగా నిర్మించిన షాది ఖానా ప్రారంభోత్సవ కార్యక్రమం. మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి.



(స్ఫూర్తి పత్రిక) సెప్టెంబర్ 19 : నంద్యాల. నంద్యాల జిల్లా బనగానపల్లె నియోజకవర్గం బనగానపల్లె పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి గారు రేపు అనగా ఆదివారం రోజున సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో ప్రారంభించనున్నారు ఈ కార్యక్రమంలో మంత్రి ఎన్ ఎమ్ డి. ఫరూక్ నంద్యాల జిల్లా కలెక్టర్ మొదలగు వారు పాల్గొననున్నారని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి గారు తెలియజేశారు బనగానపల్లె ముస్లిం సోదరులు అంటే మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి గారికి ప్రేమ అటువంటి మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం బనగానపల్లెలో దాదాపు రెండున్నర కోట్ల రూపాయలతో ముస్లిం మైనార్టీల సోదరుల కొరకు సాధికారణను నిర్మించి ఉన్నారు అలాగే గతంలో ఈ షాదీఖానా కొరకు మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మాజీ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఎంతో శ్రమించి భూమి పూజ చేయగా గత పాలకులు కక్ష సాధింపు చర్యతో నిలిపివేయడం జరిగింది మంత్రి నారా లోకేష్ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యువగలమ్ అనే కార్యక్రమంలో భాగంగా బనగానపల్లెకు విచ్చేసిన సందర్భంగా మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సభ సమక్షంలో తాను గెలిచిన వెంటనే షాది ఖానాకు హామీ ఇవ్వడం జరిగింది ఆ తర్వాత 2024 సంవత్సరంలో జరిగిన సార్వత్రిక ఎన్నికలలో బనగానపల్లె నియోజకవర్గం చరిత్రలో అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిచిన మరుక్షణమే మంత్రిగా బాధ్యతలు చేపట్టి ఇచ్చిన మాట ప్రకారం ముస్లిం సోదరుల కొరకు ఈ షాదీఖానా పనులు ప్రారంభించడం జరిగింది. నేడు రాష్ట్రంలో ఎక్కడలేని విధంగా ఒకప్పుడు మైనార్టీల కొరకు సాధికారణం అంగరంగ వైభవంగా కనివి సాధికార నిర్మించి ప్రారంభిస్తున్నారు. ఇది ఒక చరిత్ర అలాగే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో 2029 సంవత్సరంలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో కూడా మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డికి బనగానపల్లె పట్టణ ప్రజలు బనగానపల్లె నియోజకవర్గం శాసనసభ్యునిగా పట్టం కట్టాలని మళ్ళీ మంత్రిగా బీసీ జనార్దన్ రెడ్డి గారి పని చేసి బనగానపల్లె నియోజకవర్గం లోని అన్ని మండలాల్లోని అన్ని గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపిస్తారని ఇది ముమ్మాటికి జరుగుతుందని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు

## ఒమేగా అను హాస్పిటల్‌లో విజయవంతంగా అత్యాధునిక బృహద్ధమని చికిత్సలు

**వేర్వేరు వయసుల ఇద్దరు రోగులకు EVAR, TEVAR చికిత్సలు**

**మహానగరాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఒమేగా అనులో అధునాతన ఏఓర్టిక్ చికిత్స**

**మినిమల్లీ ఇన్వేసివ్ విధానాలతో సంక్లిష్ట కేసులకు చికిత్స**

**తల నుంచి పాదాల వరకు పలు రక్తనాళ సమస్యలకు ఇంటర్వెన్షనల్ రేడియాలజీ చికిత్సలు**

**ప్రముఖ వాస్క్యులర్ అండ్ ఇంటర్వెన్షనల్ రేడియాలజిస్ట్ డాక్టర్ మానం భవానీ శంకర్**




విజయవాడ (స్ఫూర్తి పత్రిక) సెప్టెంబర్ 19 : సంక్లిష్టమైన బృహద్ధమని (ఏఓర్టిక్) అన్యూరిజమ్‌లతో బాధపడుతున్న ఇద్దరు రోగులకు ఒమేగా అను హాస్పిటల్‌లో ఆధునిక మినిమల్లీ ఇన్వేసివ్ ఎండోవాస్క్యులర్ చికిత్సలను విజయవంతంగా నిర్వహించినట్లు వాస్క్యులర్ అండ్ ఇంటర్వెన్షనల్ రేడియాలజిస్ట్ డాక్టర్ మానం భవానీ శంకర్ తెలిపారు. ఎనికేపాడులోని ఒమేగా అను హాస్పిటల్‌లో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ వివరాలను వెల్లడించారు. పేషెంట్లలో ఒకరు యువతి కాగా, మరొకరు వృద్ధుడు. యువతి సాధారణ ఆరోగ్య పరిస్థితిలో ఉండగా, వృద్ధుడు గుండె, మూత్రపిండ సమస్యలతో పాటు ఇటీవల సెప్సిస్‌కు గురై అధిక ప్రమాద పరిస్థితుల్లో ఉన్నారని తెలిపారు.మొదటి కేసులో, యువతికి అబ్డామినల్ ఏఓర్టిక్ అన్యూరిజమ్ ఉన్నట్లు నిర్ధారణ అయిందన్నారు. ఆమెకు జువాా= (ఎండోవాస్క్యులర్ అన్యూరిజమ్ రిపేర్) విధానంలో చికిత్స అందించినట్లు చెప్పారు. రక్తనాళం ద్వారా స్టెంట్ గ్రాఫ్ట్‌ను పంపించి అన్యూరిజమ్‌ను రక్తప్రసరణ నుంచి వేరు చేయడం ద్వారా చికిత్స పూర్తి చేశామని, దీంతో సంప్రదాయ ఓపెన్ సర్జరీ అవసరం లేకుండా చికిత్స సాధ్యమైందని వివరించారు.రెండో కేసులో వృద్ధుడికి రప్చర్‌కు చేరువలో ఉన్న థొరాకో-అబ్డామినల్ ఏఓర్టిక్ అన్యూరిజమ్ ఉన్నట్లు గుర్తించామని డాక్టర్ భవానీ శంకర్ తెలిపారు. ఇది అత్యంత క్లిష్టమైన, అధిక ప్రమాదంతో కూడిన పరిస్థితి అని చెప్పారు. అంతేకాకుండా ఆయనకు ట్రిపుల్ వెసెల్ కరోనరీ ఆర్టరీ డిసీజ్ ఉండటంతో సీఏబీజీ చేయించుకోవాలని వైద్యులు సూచించారని తెలిపారు. మూత్రపిండాల పనితీరు కూడా దెబ్బతిని క్రియాటినిన్ స్థాయిలు పెరగడంతో పాటు, తొలుత సెప్సిస్‌తో హాస్పిటల్‌కు వచ్చినట్లు వివరించారు. ఒమేగా అనులోని మల్టీడిసిప్లినరీ వైద్య బృందం సమగ్రంగా పరిశీలించి, అవసరమైన వైద్య చికిత్సతో ఆయన పరిస్థితిని స్థిరీకరించిన అనంతరం ుజువాా= (థొరాసిక్ ఎండోవాస్క్యులర్ ఏఓర్టిక్ రిపేర్) విధానంలో బృహద్ధమని సమస్యకు విజయవంతంగా చికిత్స అందించామని తెలిపారు. వివిధ వయసులు, విభిన్న ఆరోగ్య పరిస్థితులు కలిగిన ఈ ఇద్దరు రోగులకు విజయవంతంగా చికిత్స అందించడం ద్వారా సంక్లిష్టమైన బృహద్ధమని వ్యాధుల నిర్వహణలో ఆధునిక ఎండోవాస్క్యులర్ విధానాల ప్రాధాన్యతను చాటిచెప్పామని పేర్కొన్నారు.గతంలో సంక్లిష్టమైన బృహద్ధమని, రక్తనాళాల సమస్యలకు ప్రత్యేక చికిత్సల కోసం హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి మహానగరాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదని డాక్టర్ భవానీ శంకర్ తెలిపారు. ప్రస్తుతం ఒమేగా అను హాస్పిటల్‌లో అధునాతన ఇంటర్వెన్షనల్ రేడియాలజీ సేవలు అందుబాటులోకి రావడంతో సంక్లిష్టమైన మినిమల్లీ ఇన్వేసివ్ చికిత్సలను నగరంలోని అత్యంత నైపుణ్యంతో, తక్కువ ఖర్చులో అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. మినిమల్లీ ఇన్వేసివ్ విధానంలో సురక్షితంగా చికిత్స అందించే అవకాశం ఉన్న సందర్భాల్లో పెద్ద శస్త్రచికిత్సను నివారించి, ఆధునిక చికిత్సను అందిస్తున్నట్లు తెలిపారు.ఇంటర్వెన్షనల్ రేడియాలజీ కేవలం సాధారణ రక్తనాళ సమస్యలకు మాత్రమే పరిమితం కాదని డాక్టర్ భవానీ శంకర్ అన్నారు. తల నుంచి పాదాల వరకు అనేక సంక్లిష్ట రక్తనాళ, ఇతర సమస్యలకు మినిమల్లీ ఇన్వేసివ్ చికిత్సా విధానాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వైద్య సాంకేతికతలో వచ్చిన పురోగతితో గతంలో ప్రధానంగా శస్త్రచికిత్స ద్వారా చికిత్స చేసిన అనేక సమస్యలను, ఎంపిక చేసిన రోగుల్లో ఎండోవాస్క్యులర్, ఇమేజ్-గైడెడ్ మినిమల్లీ ఇన్వేసివ్ విధానాల ద్వారా నిర్వహించే అవకాశం ఏర్పడిందన్నారు. ఈ క్లిష్టమైన కేసుల నిర్వహణలో సమన్వయంతో సేవలందించిన కార్డియాలజీ, అనస్థీషియా, నర్సింగ్ బృందాలతో పాటు ఇతర సహాయక విభాగాల సిబ్బందిని డాక్టర్ భవానీ శంకర్ ప్రత్యేకంగా అభినందించారు. అలాగే, ఒమేగా అను హాస్పిటల్‌లో అధునాతన వాస్క్యులర్, ఇంటర్వెన్షనల్ రేడియాలజీ సేవల అభివృద్ధికి నిరంతరం మద్దతు, ప్రోత్సాహం అందిస్తున్న చైర్మన్ డాక్టర్ జి. రమేష్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## ఆర్టీసీలో 15 వేల ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయాలి

**టీచర్స్, పోలీస్‌తో పాటు వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీల భర్తీకి ప్రభుత్వం చేపడుతున్న చర్యలు హర్షణీయం.**

**'స్త్రీ శక్తి' పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తున్న ఆర్టీసీలో సిబ్బంది కొరతను కూడా ప్రాధాన్యతతో పరిష్కరించాలి.**

**కండక్టర్, డ్రైవర్, మెకానికల్ సిబ్బందితో పాటు అన్ని కేటగిరీల్లోని ఖాళీలను భర్తీ చేయాలి.**

**వై. శ్రీనివాసరావు - పలిశెట్టి దామోదరరావు..... ఆర్టీసీ జేఏసీ కన్వీనర్లు**

విజయవాడ: (స్ఫూర్తి పత్రిక) సెప్టెంబర్ 19 : రాష్ట్రంలో టీచర్స్, పోలీస్‌తో పాటు వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపడుతుండటం హర్షణీయమని ఏపీ పీటీడీ (ఆర్టీసీ) ఉద్యోగ సంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్లు వై. శ్రీనివాసరావు, పలిశెట్టి దామోదరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా ప్రజా రవాణా వ్యవస్థలో కీలకపాత్ర పోషిస్తున్న ఏపీఎస్ఆర్టీసీలో దీర్ఘకాలంగా ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీపై కూడా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'స్త్రీ శక్తి' ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని విజయవంతం చేస్తూ, ప్రతిరోజూ లక్షలాది మంది ప్రయాణికులకు సేవలందిస్తున్న ఆర్టీసీలో సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని పేర్కొన్నారు. పెరిగిన ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా సిబ్బంది లేకపోవడంతో ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగులపై అదనపు పని భారం పడుతోందన్నారు.ఆర్టీసీలో కండక్టర్లు, డ్రైవర్లు, మెకానికల్ సిబ్బందితో పాటు వివిధ కేటగిరీల్లో సుమారు 15 వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ప్రభుత్వంలోని ఇతర శాఖల్లో ఖాళీలను భర్తీ చేస్తున్నట్లుగానే ఆర్టీసీలో కూడా నియామకాలకు సమాన ప్రాధాన్యత ఇచ్చి వెంటనే నోటిఫికేషన్ విడుదల చేయాలని ప్రభుత్వాన్ని జేఏసీ నాయకులు విజ్ఞప్తి చేస్తున్నారు.ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో సురక్షితమైన, సమర్థవంతమైన ప్రజా రవాణా సేవలను అందించాలంటే అవసరమైన సిబ్బంది నియామకాలు అత్యవసరమని పేర్కొంది. ఆర్టీసీలోని 15 వేల ఖాళీల భర్తీకి ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని ఆర్టీసీ జేఏసీ కో-కన్వీనర్లు పి.వి. రమణారెడ్డి, జి.వి. నరసయ్య, సి.హెచ్. సుందరయ్య, కట్టా సుబ్రహ్మణ్యం, ఎస్.వి. శేఖగిరిరావు, వై. శ్రీనివాసరావు, కె. సూర్యప్రకాశరావు, జి. మాల్యాద్రి ప్రభుత్వాన్ని కోరారు.

## ఘనంగా నేటితో గణనాధుని నిమజ్జనం

### కొత్తపల్లిలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు, అన్నదానం



ఓబులవారిపల్లి (స్ఫూర్తి పత్రిక) సెప్టెంబర్ 19 : ఓబులవారిపల్లి మండల పరిధిలోని రాళ్లచెరువుపల్లి పంచాయతీ కొత్తపల్లి గ్రామంలో వినాయక చవితి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామస్తుల కోసం పాణ్యం లక్ష్మీ చైతన్య సొంత ఖర్చులతో వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేయించగా, పాణ్యం దీప్తి తన సొంత ఖర్చులతో ప్రత్యేకంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. నేటితో గణనాథుని నిమజ్జనం ముగించనున్న సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని పూర్తి చేసి, గణనాథుడిని మంగళ వాయిద్యాలు, డప్పుల నడుమ గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఘనంగా ఊరేగించారు.ఈ సందర్భంగా భక్తులు గణనాథుడికి కుంకుమ చల్లి, వసంతాలు పోసుకుంటూ భక్తిశ్రద్ధలతో ఉత్సాహంగా పాల్గొన్నారు. పాణ్యం కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి గణనాథుడికి భక్తిపూర్వకంగా వీడ్కోలు పలికారు.ఈ నిమజ్జన కార్యక్రమంలో పాణ్యం సురేష్ బాబు నారాయణ శంకరయ్య నాగరాజా రాకేష్ జయరామయ్య నాగరాజా నాగేంద్ర శ్రీనివాసులు యశ్వంత్ వీరితోపాటు పాణ్యం వారి కుటుంబ సభ్యులు పాణ్యం చిన్నయ్య--లక్ష్మీ కళావతి దంపతులు, అల్లుడు సాయిరవితేజ, కుమార్తె స్వరూప దంపతులు, రాజశేఖర్--శ్రీదేవి దంపతులు, వారి కుమార్తెలు, కుమారులు పాల్గొన్నారు. వీరితో పాటు కొత్తపల్లి గ్రామ ప్రజలు, పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై నిమజ్జన వేడుకలను ఘనంగా నిర్వహించారు.

## వినాయక చవితి సంబరాలలో రాజంపేట పార్లమెంట్ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ యల్లటూరు శ్రీనివాస రాజు






నందలూరు(స్ఫూర్తి పత్రిక) సెప్టెంబర్ 19 : నందలూరు మండలం అరవపల్లిలో వినాయక చవితి సందర్భంగా వినాయక పూజా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ముగ్గుల పోటీలు, కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజంపేట పార్లమెంట్ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ యల్లటూరు శ్రీనివాస రాజు, హాజరై వినాయక స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ముగ్గుల పోటీలు, కబడ్డీ పోటీల్లో విజయం సాధించిన వారికి ఆయన చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గడికోట వెంకటరెడ్డి , యల్లటూరు శివరామరాజు , సమ్మెట శివప్రసాద్ , చామంచి పెంచలయ్య , చామంచి హరి , మట్టి బాబు , తుంటి రమణయ్య స్థానిక నాయకులు, యువత, మహిళలు, భక్తులు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో అరవపల్లిలో పండుగ వాతావరణం నెలకొంది.

## రామాలయం వీధిలో ఘనంగా వినాయక నిమజ్జనం



### ఐదు రోజులపాటు ప్రత్యేక పూజలు.. 50 కేజీల లడ్డూ సమర్పణ

కాకినాడ (స్ఫూర్తి పత్రిక) సెప్టెంబర్ 19 : రామాలయం వీధిలో శ్రీరామకృష్ణ వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఐదు రోజులపాటు ప్రతిష్ఠించిన వినాయకుడికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మజాలపు లక్ష్మణ్ దంపతుల చేతుల మీదుగా స్వామివారికి 50 కేజీల భారీ లడ్డూను నైవేద్యంగా సమర్పించారు.ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వినాయకుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.ఐదు రోజులపాటు వివిధ కార్యక్రమాలతో ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.చివరి రోజు వినాయకుడి నిమజ్జన కార్యక్రమాన్ని ఉత్సవ కమిటీ సభ్యులు, యువత ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు.వినాయకుడి విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.యువత కేరింతలు, భక్తుల నినాదాలతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.అనంతరం సంప్రదాయబద్ధంగా వినాయకుడి నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు.కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# వాకింగ్.. టైమింగ్!



నడకను మించిన వ్యాయామం లేదు. నిత్యం కనీసం 8వేల అడుగులైనా వేస్తే.. ఆరోగ్యానికి ఎంతో మేలు. కానీ, ఉదయాన్నే వాకింగ్‌కు వెళ్లడం అందరికీ సాధ్యంకాదు. అలాంటివారు సాయంత్రపు నడకను ఎంచుకుంటారు. అయితే.. ఉదయపు వ్యాయామం మంచిదా? సాయంత్రం వాకింగ్ బెటరా? అన్న అనుమానం చాలామందిని తొలుస్తూ ఉంటుంది. అందుకే, ఏ సమయంలో నడక సాగిస్తే ఆరోగ్యానికి ఎలాంటి ప్రయోజనాలు చేకూరుతాయో తెలుసుకుందాం.

**మార్నింగ్ వాక్‌తో..**

తెల్లవారుజామున నడక.. శారీరక, మానసిక ప్రయోజనాలను అందిస్తుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. పార్కుల్లో, ప్రశాంతమైన వాతావరణంలో వాకింగ్ చేయడం.. మనసుకు ఆహ్లాదాన్ని ఇస్తుంది. ఉదయాన్నే శరీరానికి స్వచ్ఛమైన ఆక్సిజన్ అందితే.. రోజంతా హుషారుగా గడుస్తుంది. మనసు ప్రశాంతంగా ఉండి.. మనిషిలో సృజనాత్మకత పెరుగుతుంది. అది.. పనిపై అనుకూల ప్రభావం చూపుతుంది. జీవక్రియల రేటు పెరిగి.. బరువు కూడా తగ్గుతుంది. మార్నింగ్ వాక్ వల్ల శరీరంలోని కొవ్వు కరిగి.. శక్తిగా మారుతుంది.

**సాయంత్రం నడకతో..**

రోజంతా పనిచేసి అలసిపోయిన వారు.. సాయంత్రపు నడకతో రిలాక్స్ అవుతారు. పని ఒత్తిడి నుంచి ఉపశమనం లభిస్తుంది. గాఢమైన నిద్ర పడుతుంది. నిద్రలేమితో బాధపడేవారికి సాయంత్రం నడక మంచి ఫలితాలను అందిస్తుంది. రాత్రి భోజనం తర్వాత ఓ 10 %-% 15 నిమిషాలు నడిస్తే.. జీర్ణ సమస్యలు కూడా దూరం అవుతాయి.

**ఏది బెస్ట్ టైమ్?**

నిజానికి ఉదయం నడిచినా.. సాయంత్రం నడిచినా ఆరోగ్యానికి మేలే! కాబట్టి.. మీకు అనువుగా ఉన్న సమయాన్నే వాకింగ్ కోసం ఎంచుకోండి. ఆరోగ్యాన్ని కాపాడుకోండి.

# సత్య చెప్పిన గీత!



జయ జయ ధ్వానాలు.. పూల వానలు.. దేవతలు వెలిగించిన దీపాల వరుసలు.. విజయ దరహాసంతో సత్యాకృష్ణులు. నరకాసుర సంహారం జరిగింది. దీపావళి పుట్టింది. సత్యాదేవి విక్రమ పరాక్రమాలను శ్రీకృష్ణుడితోపాటు లోకమూ సంభ్రమాశ్చర్యాలతో తిలకించింది. అతి సుకుమారి అయిన శ్రీకృష్ణుడి ప్రియసఖి అలవిగాని రాక్షసులను అలవోకగా మట్టుబెట్టింది. ఈ సన్నివేశానికి ముందు సత్య వేరు, తర్వాతి సత్య వేరు! కన్నయ్య ప్రణయ రాణిగా పరిచయమున్న ఆమె వీరనారిగా వెలిగిన సందర్భమది. గరుత్మంతుడి మీద నిలబడి వింటినారిని సంధించిన ఆమె నారీలోకానికి సాటిలేని సూచనలు చేసింది. కురుక్షేత్రంలో శ్రీకృష్ణుడు మానవాళికి గీతను బోధిస్తే, ఈ యుద్ధక్షేత్రంలో సత్యాదేవి మహిళామణులకు మన్నికైన సంగతుల్ని నేర్పింది. రణరంగానికి వెళ్లడం నుంచి విజయంచేజిక్కించుకునేంత వరకూ ఆమె వేసిన ప్రతి అడుగూ ఓ పాఠమే! యుద్ధం ఎప్పుడూ కఠినంగానే ఉంటుంది. సత్య కాలమైనా.. సత్యా కాలమైనా. అప్పుడూ ఇప్పుడూ విజయానికి శక్తి ఒక్కటే చాలదు, యుక్తి కూడా ఉండి తీరాల్సిందే. గెలుపు పొందాలంటే ఎంత శ్రద్ధతో శ్రమించి పనిచేస్తామో అంతే ప్రశాంతంగా దాన్ని కొనసాగించాలంటుంది సత్యగీత. మనసైన వాడిని మనువాడటమే కాదు, మనవాడిని చేసుకోవడమూ మనసున పట్టాలంటుంది. స్త్రీగా సుందర సుకుమార సౌరభాలు ఎంత అవసరమో, ధీర వీర గుణసమూహాలూ అంతే అవసరం అంటుంది. అలాగని మనమేం రుద్రకాళిలా భద్రకాళిలా కనిపించనక్కర్లేదు. అవసరమైన చోట అనితరమైన శక్తిని అనుసంధానం చేస్తే సరి! దుర్గమ్మ చేసింది అదే%ౌ% సత్యమ్మ చేసిందీ అదే%ౌ% నేటి ప్రతి అమ్మా చేయాల్సిందీ కచ్చితంగా అదే!!

**మెప్పించి ఒప్పించి**

ఓ క్లిష్టమైన పనిలో ముందడుగు వేసే ముందు మనకు దగ్గరి వాళ్లు తప్పకుండా అందులో కష్టనష్టాలను చెబుతారు. ఇప్పుడు ఆ పనిచేయడం అంత అవసరమా అన్న సందేహాన్నీ వెలిబుచ్చుతారు. సాక్షాత్తూ కృష్ణపరమాత్మ కూడా సత్యాదేవి యుద్ధరంగానికి వస్తానంటే అలాగే చెప్పాడు. 'సత్యా యుద్ధ రంగమంటే ఏం అనుకున్నావు. పువ్వుల మీద వాలే తుమ్మెదల ఝుంకారాలు కాదు, భయంకరమైన ఏనుగుల ఘీంకారాలు వినిపిస్తుంటాయక్కడ. అక్కడ కనిపించేవి పిల్లగాలికి తామరపువ్వుల మీద రేగే పుప్పొడి రేణువులు కాదు, వేగంగా పరిగెత్తే గుర్రపు డెక్కల చివరల నుంచి లేచిన దుమ్ము దుమారాలు. ఆ చోటంతా శూలాలూ, ఖడ్గాలూ, రాక్షసులూ. సుకుమారీ నువ్వెక్కడ, ఆ రణరంగం ఎక్కడ? నేను ఇప్పుడే వచ్చేస్తానుగా%ౌ% ఉండు' అంటాడు కృష్ణుడు. భామ వదలదు. అన్ని చెప్పాడని భయపడదు. తనను వద్దన్నాడని చిన్నబుచ్చుకోదు. ప్రాణ సఖుడికి మరింత దగ్గరగా చేరుతుంది. భుజం మీద గడ్డం ఆన్చి ఆయనకు మాత్రమే వినిపించేలా%ౌ% 'దానవులు ఉంటేనేం%ౌ% రాక్షస సమూహాలు ఉంటేనేం%ౌ% శత్రు దుర్భేద్యమైన కోటల్లాంటి మీ భుజాల వెనుక నేనుంటే%ౌ% నాకేం భయం' అన్నది. కాస్త పక్కకు జరిగి రెండు చేతులూ జోడించి నమస్కరించింది. ఆ మాటలకు కృష్ణుడు తబ్బిబ్బయ్యాడు. అభిమానంగా ఓ చూపు చూశాడు. 'దా%ౌ% ఎక్కు' అన్నాడు పక్షీంద్రుడి వంక చూపుతూ. అదీ సత్యాసతీ సంధత!! సత్యమ్మ యుద్ధంలో తొలిమెట్టు ఎక్కింది ఇక్కడే. పెద్ద సవాళ్లు, మన వాళ్ల సలహాలు, ముందుకు వెళ్లే ఆలోచనలు.. అన్నిటినీ ఎలా నిర్వహించుకోవాలి అన్నదానికి చక్కనైన ఉదాహరణ ఈ సందర్భం.

**ఆత్మ విశ్వాసానికి ప్రతీకలా..**

నరకుడు భయంకరమైన రాక్షసుడు. పద్నాలుగు లోకాలనూ ఆక్రమించాడు. ఎంతో బలగం ఉన్నవాడు. యుద్ధం అనగానే లక్షల సైన్యాన్ని మోహరించాడు. శ్రీకృష్ణుడు పాంచజన్యం పూరించగానే వాళ్లంతా గోలగోలగా కదిలారు. ఢంకాలూ బూరలూ పెద్దపెద్ద వాయిద్యాలతో చప్పుళ్లు చేస్తూ అరుస్తున్నారు. అయితేనేం, సత్య వెరవలేదు. అవసరం అనుకున్నప్పుడు అడుగు ముందుకు వేయడమే తప్ప వెనక్కి తిరిగే లక్షణమే లేదు ఆమెకు. నరకుడు ముందుకు ఉరకడం చూసి స్వామి చేతి నుంచి ధనుస్సును అందుకుంది. యుద్ధం నేను చేస్తాగా, నీకెందుకు%ౌ% అంటూనే విలాసంగా వింటిని అందించిన కృష్ణుడే విస్తుపోయేలా శస్త్రాలు ప్రయోగించింది. తను బాణాలు సంధించడానికి ఎక్కడా ఇబ్బంది రాకుండా పొడవాటి జడను ముడివేసింది. చీర నడుముకు చుట్టింది. నగలన్నిటినీ సర్ది పెట్టింది. రాక్షస సంహారానికి స్వామి వినియోగించే మహత్తరమైన ధనువును చేతితో పట్టుకుని వంగి వింటినారిని కట్టి%ౌ% టంకారం చేస్తుంటే సాక్షాత్తూ శ్రీకృష్ణుడే విస్తుబోయి చూశాడట. ఎంత వేగంగా విల్లును పట్టుకుందో, అంతే వేగంగా అస్త్రాలు సంధించడం మొదలుపెట్టింది. ఎడమకాలు ముందు పెట్టి, కుడికాలిని వంచి పట్టి ఆమె బాణాలు వేసే తీరుకు శ్రీహరి ముగ్ధుడైపోయాడు. ప్రచండమైన వేగంతో ప్రయాణించే గరుత్మంతుడి మీద ఆమె నిలబడి శరం సంధిస్తుంటే ప్రళయ కాలపు సూర్యుడిలా కనిపించిందట. ఒక్కో అస్త్రాన్నీ మంత్రించి రాక్షసుల మీదకు వదులుతుంటే కుప్పలకొద్దీ జనం చచ్చారట. అనుకుంటూ ముక్కున వేలేసుకున్నాడట నారాయణుడు. రుక్మిణమ్మ బొమ్మల పెండ్లిండ్లు చేస్తున్నదట పల్లకీలో పోయిరామ్మా%ౌ% అంటే అలసిపోతాను నావల్ల కాదు అని చెప్పే ఈ సుకుమారి రణరంగానికేల వచ్చింది. మగవాళ్లను చూస్తేనే పక్కకు తప్పుకొనే ఈ పడతి పగవాళ్లని మట్టికరిపిస్తున్నదా. బంగారపు ఉయ్యాలనెక్కమంటేనే భయమంటుందే%ౌ% ప్రచండ వేగంతో ప్రయాణించే ఈ గరుత్మంతుడి మీద ఎక్కి యుద్ధం చేస్తున్నదా%ౌ% అనుకున్నాడట పరంధాముడు. నిజంగానే%ౌ% బంగారు ఉయ్యాల ఎక్కమంటే భయం అనేంత పిరికిగా కనిపించిందీ ఆ సత్యే. ఇవాళ ఖగపతి మీద వీర విహారం చేస్తున్నదీ ఆ సత్యే. అవును అవసరాన్ని బట్టి అవతారం ఎత్తాల్సిందే! కావాలనుకున్న చోట ఆత్మవిశ్వాసంతో కనిపించాల్సిందే! సమస్యను తీర్చాలంటే తెగించి వచ్చి తెలిసిన శస్త్రాలన్నీ ప్రయోగించాల్సిందే! ఆడది అంటే అబల కాదు%ౌ% సబల అని త్రేతాయుగంలోనే నిరూపించిన సత్యభామ బాట%ౌ% రోజువారీ జీవితంలో ఎదురయ్యే ప్రతి సవాలుకీ అష్టాక్షరీ మంత్రంలా పనిచేస్తుంది.

**చెరగని ప్రశాంతత**

సత్య శ్రీకృష్ణుడితో కలిసి నరకుడి మీద యుద్ధం చేస్తున్నది. శత్రువుల నుంచీ వచ్చే బాణాల పరంపర కొనసాగుతూ ఉంది. వాళ్లు అరుస్తున్నారు. ఈవిడా గర్జిస్తున్నది. సవాళ్లు%ౌ% ప్రతి సవాళ్లు. కన్ను తిప్పే వల్ల లేదు. క్షణం ఏమరుపాటు ప్రమాదాన్ని కొని తెస్తుంది. అలాంటప్పుడు ఎవరైనా ఎలా ఉంటారు. భీకరమూర్తిలా కనిపిస్తారు. వీరత్వానికి ప్రతీకలా ఉంటారు. కానీ సత్యలో వీర, శృంగార, భయ, రౌద్ర, విస్మయ భావాలన్నీ ఒకేసారి కనిపించాయట. రౌద్రమూ, శృంగారమూ ఒకేసారి అదీ యుద్ధరంగంలో ఎలా కనిపిస్తాయి%ౌ% అన్న అనుమానం కలగడం సహజమే. కానీ ఆమెలో కనిపించాయి. తన ప్రియసఖుడితో కలిసి శత్రువు మీద యుద్ధం చేస్తున్నది. అసురుడి మీదికి ఓ అస్త్రం విసురుతున్నది. స్వామి వైపు వెనక్కి తిరిగి 'చూశారా%ౌ%' అన్నట్టు ఓ నవ్వు నవ్వుతున్నది. మళ్లీ బాణం ఎక్కుపెట్టి%ౌ% ప్రాణనాథుడిపైకి ఓ క్రీగంటి చూపు విసురుతున్నది. కోమలాంగి వీరత్వం చూసి మురారి ముచ్చట పడుతూ అలా చూస్తూ ఉండిపోయాడట. అంటుంది పోతన భాగవత పద్యం. యుద్ధం చేస్తున్న సత్యాదేవి ముద్దుల ముఖం నందనందనుడికి చంద్రబింబంలా కనిపిస్తున్నదట. నరకాసురుడికి మాత్రం మండే సూర్యుడిలా గోచరమైందట. గాలికి ఎగురుతున్న ఆమె చీరకొంగు ఆయనకు మన్మథ పతాకంలా కనిపిస్తే.. రాక్షసుడికి ధూమకేతువు (పొగతో కూడుకున్న తోకచుక్క)లా కనిపించిందట. ఆమె అటూ ఇటూ తిప్పుతూ బాణాలు వేస్తున్న విల్లు స్వామికి కాముడి వలయంలా కనిపిస్తే, రాక్షసుడికి కాలుడి భాను పరివేషంలా తోచిందట. శత్రువులకు నీరసం తెప్పిస్తూ, సొంత వారి ఉత్సాహాన్ని రెట్టింపు చేస్తూ సాగిందామె యుద్ధం. ముఖ్యమైన పనుల్లో పడి నవ్వడాన్ని మరిచిపోయే వాళ్లు తప్పకుండా గమనించాల్సిన అంశం ఇది. హడావుడిగా ఉన్నామంటూ భాగస్వామిని పక్కన పెట్టే వాళ్లు పరిశీలించాల్సిన విషయం ఇది. మనది సత్య చేసిన దానికన్నా పెద్ద యుద్ధమా! నరకాసురుడికన్నా పెద్ద ఇబ్బందా!! ఎంత ప్రశాంత చిత్తంతో పనులు చేస్తే అంత విజయం అన్నది ఇక్కడ సత్య చెప్పిన పాఠం. అవును అలాగే సత్య గెలిచింది. సత్యాకృష్ణులు గెలిచారు. నరకుడు ఓడాడు. దీపావళి వచ్చింది. ఇంతులంతా ఇదే రీతిలో సత్యగీతను పాటిస్తే%ౌ% ఇంటింటా నిత్య దీపావళే!

# ఎటమటం - మా మాటే శాసనం..







ఎటమటం

పాపం..! సర్కారోళ్లు ఏ పని పెట్టుకున్నా.. అది ఎదురు గొడుతున్నదట. కారు పార్టీ వాళ్లను ఇరుకునపెడదామని ఎన్ని ఉచ్చులు పన్నినా.. ఆఖరికి అవి హస్తం నేతల మెడకే సుట్టుకుంటున్నయట. ఈ మధ్య ఓ కాంగ్రెస్ నాయకుడు పొలిటికల్ బాంబులు.. ఆటం బాంబులు అనుకుంట చేతులనే పట్టుకొని తిరుగుతున్న విషయం ఎరుకే కదా! అటు దిరిగి ఇటు దిరిగి ఆ బాంబులు వాళ్ల సారు సీటు కిందనే పేలే మోపయ్యాయట. హస్తం గుర్తు కీలక నేత ఒకరు ఢిల్లీ పోయి 'ఈనె ఉంటే ఇందిరమ్మ పెట్టిన పార్టీ ఆగమాగమయ్యే కాడికి వచ్చి'ందని ఫిర్యాదు చేసిండట. 'మరేం జేద్దమంటవ్' అని ఢిల్లీ పెద్దలు అడగగా.. 'నాకు ఇయ్యండి. ఢిల్లీకి ఏం కావాలో నేనే చూసుకుంట' అని అన్నడట. ఈ మాట పెద్దలకు కూడా బాగా నచ్చడంతో.. 'టైం చూసి బొట్టుపెట్టి పిలుస్తం పో' అని ఒట్టేసి చెప్పిండ్రట. అయినా ఆ కీలక నేత కదలకుండా అక్కడే నిలబడ్డడట. దాంతో 'మా మాటే శాసనం. ఇక నువ్వే ముఖ్యనేతవు పో' అని మరోసారి ఆన పెట్టిండ్రట. ఇక అప్పటి నుంచి కీలక సారు అనుచరులు ఆగుతలేరు. 'మా సారు ముఖ్యమంత్రి అని పోస్టర్లు, బ్యానర్లు తయారు చేసి సోషల్ మీడియాల గింగిరాలు తిప్పిస్తున్నరు.

**ఎమ్మెల్యేల మొర..!**

ఆ మంత్రక్క దంపతులతో ఎవరికి గండముందో తెలియక ఎమ్మెల్యేలు హడలిపోతున్నరట. ఆ మేడం, వాళ్ల సారు కలిసి ఏ నియోజకవర్గానికైనా టూర్‌కి వెళ్తే.. అక్కడి స్థానిక ఎమ్మెల్యేకు గండం పొంచినట్టేనట. వందలాది మంది కార్యకర్తలు జెండాలు పట్టుకొని ఎదురుబడి 'జై కాంగ్రెస్, జైజై అక్క దంపతులు' అంటే చాలు.. ఈ నియోజకవర్గం తమదేనని పుసుక్కున కూసేత్తరట వారు. వచ్చే ఎన్నికల్లో ఇక్కడి నుంచి తామే పోటీ చేస్తున్నమని చెప్పేత్తరట. ఆ మధ్య ఓ పంచాయితీకి పోలీసు స్టేషన్‌కు పోయి ఎస్ఐ సారును లేపి మరీ కూసున్నది గదా..! గా.. మంత్రి దంపతులతోనే ఈ కిరికిరి అంత. పరకాల వెళ్లినప్పుడల్లా.. 'వచ్చేసారి మా బిడ్డదే ఈ సీటు' అని ఓ కూత కూసి వత్తున్నరట వారు. ఆ మాటకు మండిన స్థానిక ఎమ్మెల్యే, ఆ దంపతులు రోడ్డు మీద కొట్టుకున్న సంగతి ఎరుకే గదా. ఈ మధ్య పాలకుర్తికి వెళ్లిన దంపతుల్లో ఒకరు వచ్చే ఎన్నికల్లో తాను ఇక్కడి నుంచే పోటీ చేస్తనని కార్యకర్తలకు చెప్పిండ్రట. ఈ మాట విన్న అక్కడి చెయ్యి పార్టీ ఎమ్మెల్యే అగ్గిమీద గుగ్గిలం అయిపోయిందట. భూపాలపల్లి పోయి 'మా అల్లుడు వస్తడు' అని అన్నరట. ఇట్లా ఎక్కడికి పోయినా.. 'మాకు చెరొకటి, మా బిడ్డకు, మా అల్లునికి ఒక్కో నియోజకవర్గం' అని పప్పు బెల్లం పంచినట్టు పంచుతుండటంతో విసుగెత్తిపోయిన ఎమ్మెల్యేలు అధిష్ఠానానికి ఫిర్యాదు చేసిండ్రట. 'ముందుగా అక్క సీటు ఊడగొట్టి మమ్ముల నిమ్మళంగ ఉంచుర్రి' అని మొరపెట్టుకున్నరట.

**ఎర్తు పెడుతున్నరా..?**


'తన కిందికి కల్లు నీళ్లు తెచ్చే పనేదో చేస్తన్నడు' అని ముఖ్యనేత అనుమాన పడిపోతున్నడట. కాంగ్రెస్‌ను నడిపించే పదవి వస్తదని ఆశపడి భంగపడ్డ నేత ఉన్నడు కదా. అగో ఆయన మీదనే మన ముఖ్యనేతకు శంక ఉన్నది. అసలే రాహుల్‌గాంధీకి దోస్తని పేరున్నది. కనపడకుండా ఏదో ఎర్తు పెట్టే పనిలో ఉన్నడని ముఖ్యనేత జంకుతున్నడట. తాను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకున్ని కానీ, తనది కాంగ్రెస్ పార్టీ అని చెప్పుకోవాల్సి వస్తోందని, ఈ మధ్య సీనియర్ నాయకుడొకరు రోడ్డు మీదికి వచ్చి నెత్తినోరు బాదుకున్నడుగా. అగో.. ఆ నాయకునితోని సదరు నేత జట్టు కట్టిండట. ఈ మధ్య ఎటుపోయినా ఇద్దరూ అతుక్కపోయి తిరుగుతున్నరట. ముచ్చట్లు పెడుతున్నరట. మున్షీ మేడమ్‌కు షికాతి చేసిండ్రట. వీళ్ల పోకడను చూసే ముఖ్యనేత తెగ ఇబ్బందితో ఉన్నడని జనం అనుకుంటున్నరు.

**చైనా బ్రదర్స్ కుర్సీ కిరికిరి**

ఆ.. ఇద్దరు బ్రదర్స్‌కు చైనా బ్రదర్స్ అని పేరుంది. చైనా సరుకుకు తక్కువ ధరే కానీ ఎప్పుడూ సక్కగ పని చేయవు. వీళ్లు అంతేనటా. డబుల్ ఇంజిన్ లెక్క ఉండి అభివృద్ధి చేస్తరనుకుంటే చైనా ఇంజిన్ల లెక్క తయ్యారయిండ్రట వారు. వారిలో ఒకరు అమాత్య పదవిలో ఉండగా.. ఇంకోకరు ఆ మాత్రం పదవి నాకు రాదా? అని ఎదురుచూస్తున్నడట. వీళ్ల సంగతి పసిగట్టిన ముఖ్యనేత బర్రెకు ఎగేత్తన్నడట.. దూడెకు సగేత్తన్నడట. ఇక అప్పటి నుంచి అన్న మొహం తమ్ముడు, తమ్ముడి మొహం అన్న జూసుడు లేదట. అమాత్య కూటంలో ఇద్దరన్నదమ్ములు గుత్పలు పట్టుకునే కాడికి వచ్చింది. 'ఇద్దరిద్దరు పంచాయితీల పడి మమ్ములను మర్సిపోతున్నరు' అని అంటున్నరు నియోజకవర్గం ప్రజలు.

# పచ్చదనంలో ప్రమాద ఘంటికలు

కొలంబియాలోని కాలీలో 2024 అక్టోబర్ 28న జరిగిన జీవవైవిధ్య సదస్సులో ఐయూసీఎన్ (ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్) తన మొదటి ప్రపంచ వృక్ష అధ్యయన నివేదికను విడుదల చేసింది. ప్రపంచంలోని 38 శాతం వృక్షజాతులు కనుమరుగయ్యే స్థితిలో ఉన్నాయని తన 'రెడ్ లిస్ట్'లో తెలిపింది. ప్రతి మూడింటిలో ఒక వృక్షజాతి అంతర్ధానమయ్యే పరిస్థితి దాపురించడం జీవజాతులన్నింటినీ పెను ప్రమాదంలో పడవేయబోతున్నది. పక్షి, జంతు, సరీసృప, ఉభయచర జాతుల కంటే ఎక్కువ వృక్షజాతులు నశించే ప్రమాదం పొంచి ఉండటం తీవ్రంగా ఆందోళన కలిగించే పరిణామం. దాదాపు 38 శాతం వృక్షజాతులు అంతరించనున్నాయనే ఐసీయూఎన్ 'రెడ్ లిస్ట్' జీవవైవిధ్యానికి, పర్యావరణ సమతుల్యతకు జరుగబోయే విధ్వంసాన్ని కళ్లకు కట్టినట్టు చూపుతున్నది.




**అడవుల వినాశనం మానవజాతికి మరణశాసనం**

**డొరొతీ స్టాంగ్**

1948లో స్థాపించిన ఐయూసీఎన్ సంస్థ ప్రకృతి పరిరక్షణ, సహజవనరుల సమర్థ వినియోగంపై అంతర్జాతీయ స్థాయిలో పనిచేస్తున్నది. ప్రపంచవ్యాప్తంగా ప్రకృతి స్థితిని, దాన్ని కాపాడటానికి అవసరమైన చర్యలు చేపట్టేందుకు ఇది కృషి చేస్తున్నది. పర్యావరణ పరిరక్షణకు సంబంధించి సమాచార సేకరణ, విశ్లేషణ, పరిశోధన తదితర అంశాలపై జరిగే సమావేశాల్లో పాల్గొని, ప్రపంచవ్యాప్తంగా ఉన్న వివిధ సంస్థలకు దిశానిర్దేశం చేస్తుంది. ఈ సంస్థ అక్టోబర్ 28న విడుదల చేసిన రెడ్ లిస్ట్ ఇప్పుడు పర్యావరణ శాస్త్రవేత్తలను, ప్రకృతి ప్రేమికులను ఆందోళనకు గురిచేస్తున్నది. మొత్తం 47,282 వృక్షజాతులపై మదింపు జరుగగా.. 16,425 జాతులు అంతరించిపోయే ప్రమాదంలో ఉన్నట్టు తేలింది. అలాగే ఈ విధ్వంసం బారినపడ్డ వృక్షాల సంఖ్య, అంతరించిపోయే పక్షి, జంతు, సరీసృప, ఉభయచర జాతుల సంఖ్యకు రెండింతలకు పైగా ఉండటం గమనార్హం. భూగోళ పర్యావరణ వ్యవస్థలో చెట్ల పాత్ర ఎంతో కీలకమైనది. అవి బతుకుతున్నాయడం కంటే మనల్ని బతికిస్తున్నాయనడం ఉత్తమం. భూమిపై జీవం వర్ధిల్లడానికి, కోట్లాది మంది (1600 కోట్లు) మానవుల ప్రాణాలకు, వారి జీవనోపాధికి ప్రత్యక్షంగా, పరోక్షంగా వృక్షాలు దోహదపడుతున్నాయి. 2020లో ప్రపంచ అటవీ విస్తీర్ణం 4.06 బిలియన్ హెక్టార్లు (1000 కోట్ల ఎకరాలు)గా ఉంది. మొత్తం భూ విస్తీర్ణంలో ఇది 31 శాతం. ఇందులో 54 శాతం కేవలం ఐదు దేశాల్లో (బ్రెజిల్, కెనడా, చైనా, రష్యా, అమెరికా) ఉంది. అటవీ విస్తీర్ణం పరంగా రష్యాది ప్రథమ స్థానం. 2009లో మూడింట రెండొంతుల అటవీ విస్తీర్ణం 10 దేశాల్లోనే ఉండేది. అవి బ్రెజిల్, కెనడా, చైనా, రష్యా, అమెరికా, ఆస్ట్రేలియా, కాంగో, భారత్, ఇండోనేషియా, పెరూ. 2023లో ప్రపంచం 6.37 మిలియన్ హెక్టార్ల అటవీ విస్తీర్ణాన్ని కోల్పోయింది. 2030 వరకు అటవీ నిర్మూలనను పూర్తిగా అరికట్టాలనే 140 దేశాల లక్ష్యం కంటే ఇది 45 శాతం అధికం కావడం గమనార్హం. వివిధ కారణాల వల్ల ప్రపంచవ్యాప్తంగా ఏటా భూగోళం పెద్ద విస్తీర్ణంలో అటవీ భూమిని కోల్పోతున్నది. ప్రాంతం, దేశాలను బట్టి ఆ కారణాలు మారుతున్నాయి. వ్యవసాయ భూమి విస్తరణ, వివిధ అవసరాలకు చెట్ల నరికివేత, పట్టణీకరణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి, గనులు, దావానలాలు వాటిలో ప్రధానమైనవి. అటవీ నిర్మూలన భ యంకరమైన వాతావరణ మార్పులకు దారితీస్తుండటం ఇప్పుడు ప్రపంచాన్ని కలవరపరుస్తున్నది. మన దేశంలో పరిస్థితులు ఇంకా దారుణంగా ఉన్నాయి. ప్రభుత్వ లెక్కల ప్రకారం 2021 వరకు భారత్‌లో అటవీ విస్తీర్ణం 80.0 మిలియన్ హెక్టార్లు(20 కోట్ల ఎకరాలు)గా ఉండేది. ఇది దేశ భూ భాగంలో 21.71 శాతం. అయితే, 2015-2020 మధ్యకాలంలో ఏటా 6,68,000 హెక్టార్ల మేరకు అటవీ నిర్మూలన జరిగింది. దీని వల్ల భారత్ భారీగా అటవీ భూ భాగాన్ని కోల్పోయింది. 2000 సంవత్సరం నుంచి చూసుకుంటే 23.3 లక్షల హెక్టార్ల అటవీ భూమిని మన దేశం కోల్పోయింది. ఇది ఏడాదికి 6 శాతం. సుస్థిర వ్యవసాయ పద్ధతులను అవలంబించడం, పంటల మార్పు, పునర్వనీకరణ, అటవీ వ్యవసాయం, సేంద్రియ వ్యవసాయ పద్ధతులు అడవుల విస్తీర్ణం తగ్గిపోవడాన్ని నిరోధించగలవు. వ్యవసాయం కోసం జరిగే భూవిస్తరణను ఇవి అరికడతాయి. తత్ఫలితంగా అడవుల నరికివేత తగ్గిపోతుంది. మనకు ఇప్పుడు అందుబాటులో ఉన్న వ్యవసాయ భూమినే సమర్థవంతంగా వాడుకోవడం, మరింత ఎక్కువ దిగుబడి సాధించడమే పై పద్ధతుల ప్రధాన ఉద్దేశం. వాణిజ్యపరంగా, కట్టడాల నిర్మాణానికి కలపను వాడకుండా ప్రత్యామ్నాయ వనరులు వినియోగించడం, కాగితపు వాడకానికి చెక్క గుజ్జుకు బదులు వేరే పద్ధతులను అన్వేషించడం లాంటివి చెట్లను రక్షింపగలవు. నరికివేతను పూర్తిగా తగ్గించి, పునర్వనీకరణ అంటే అడవులను తిరిగి పెంచడం అంత సులభమేమీ కాదు, అలాగని అసాధ్యం కూడా కాదు. ఉదాహరణకు, కోస్టారికా ఎప్పుడో కోల్పోయిన వర్షాధార ఉష్ణమండల అడవిలో కొంతభాగాన్ని విజయవంతంగా పునరుజ్జీవింపజేయగలిగింది. అయితే, దీనికి 50 ఏండ్లు పట్టింది. అలాగే పునర్వనీకరణలో భాగంగా 1950 నుంచి ఇప్పటివరకు చేపట్టిన పలు కార్యక్రమాల ద్వారా దక్షిణ కొరియా అటవీ విస్తీర్ణం 35 నుంచి 64 శాతానికి పెరిగింది. లక్ష్యాలను సాధించడానికి దశాబ్దాల సమయం పట్టవచ్చేమో గానీ, సానుకూల ఫలితం మాత్రం తప్పకుండా ఉంటుందనడంలో ఎలాంటి సందేహం లేదు. తెలంగాణ రాష్ట్రం చేపట్టిన హరితహారం కార్యక్రమం అందుకు చక్కటి ఉదాహరణ. దేశంలో అటవీ విస్తీర్ణం పెంపుదలలో తెలంగాణ రాష్ట్రం అగ్రస్థానంలో ఉన్నది. సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ (సీఎస్ఈ), డౌన్ టు ఎర్త్ నివేదిక ప్రకారం.. 2019 నుంచి 2021 వరకు రాష్ట్రంలో 7 శాతం అటవీ విస్తీర్ణం పెరిగింది. కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన 'హరితహారం' కార్యక్రమమే దీనికి ప్రధాన కారణం. తెలంగాణ రాష్ట్రం చేపట్టిన హరితహారం కార్యక్రమం అందుకు చక్కటి ఉదాహరణ. దేశంలో అటవీ విస్తీర్ణం పెంపుదలలో తెలంగాణ రాష్ట్రం అగ్రస్థానంలో ఉన్నది. సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ (సీఎస్ఈ), డౌన్ టు ఎర్త్ నివేదిక ప్రకారం.. 2019 నుంచి 2021 వరకు రాష్ట్రంలో 7 శాతం అటవీ విస్తీర్ణం పెరిగింది. కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన 'హరితహారం' కార్యక్రమమే దీనికి ప్రధాన కారణం. ఈ కార్యక్రమం కింద గత తొమ్మిదేండ్లలో (2015-2023) 273 కోట్ల మొక్కలు నాటారు. అంతేకాదు, తెలంగాణలో పుట్టి దేశవ్యాప్తంగా ఎంతో పేరు తెచ్చుకున్న గ్రీన్ ఇండియా చాలెంజ్ కార్యక్రమం ద్వారా ఇప్పటివరకు 19.5 కోట్ల మొక్కలను నాటడం ఒక రికార్డు. రాజ్యసభ మాజీ సభ్యుడు జోగినపల్లి సంతోష్‌కుమార్ ప్రారంభించిన ఈ కార్యక్రమం దేశంలోని ప్రతీమూలకు చేరింది. సెలబ్రిటీలందరూ దీనిలో భాగస్వాములయ్యారు. గ్రీన్ ఇండియా చాలెంజ్ కింద కొంతమంది ప్రముఖులు అడవులను దత్తత తీసుకోవడం విశేషం. ఈ నేపథ్యంలో ఐయూసీఎన్ రెడ్ లిస్ట్‌ను ఇప్పుడు భారత్‌తో పాటు ప్రపంచ దేశాలు మరో హెచ్చరికగా చూడాల్సిన అవసరమున్నది. 2030లోపు అటవీ నిర్మూలనను పూర్తిగా అరికట్టాలనే 140 దేశాల సంకల్పం నెరవేరే పరిస్థితులు కనిపించడం లేదు. అంతర్జాతీయంగా అందుకు కావాల్సిన చిత్తశుద్ధి కొరవడటమే అందుకు కారణం. అటవీ నిర్మూలనను అరికట్టే దిశగా కొంతమేరకు వృద్ధి కనిపిస్తున్నా, రెడ్ లిస్ట్ ప్రకారం చూస్తే అది ఏ మాత్రం సరిపోదు. ఇంకా వేగవంతంగా చర్యలు చేపట్టాలి. అనుకున్న లక్ష్యాన్ని సాధించాలంటే ప్రణాళికలను కఠినంగా అమలు చేయాలి. ఐయూసీఎన్ రెడ్ లిస్ట్‌లో ఉన్న వృక్షజాతులను పరిరక్షించడానికి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలి. ప్రపంచ దేశాలు మేల్కొని ఈ విషయమై సంబంధిత ప్రభుత్వ సంస్థలతో చర్చించాలి. తగు చర్యలను సత్వరమే చేపట్టాలి. ప్రస్తుతం ఉన్న అడవులను కాపాడేందుకు వాటిని జాతీయ పార్కులుగా, రిజర్వ్ ఫారెస్టులుగా ప్రకటించాలి. తద్వారా చెట్ల నరికివేత ఆగుతుంది. అదే సమయంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఒక ఉద్యమంలా చేపట్టాలి. గ్రీన్ ఇండియా చాలెంజ్ లాంటి కార్యక్రమాలు ప్రపంచవ్యాప్తంగా రావాల్సిన అవసరమున్నది. సమాజాన్ని, స్వచ్ఛంద సంస్థలను, వివిధ సంఘాలను, కార్పొరేట్ కంపెనీలను, సెలబ్రిటీలను అందులో భాగస్వాములను చేయాలి. సామాజిక అడవుల నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించాలి. మనిషి నివసించడానికి, జీవించడానికి ఒకవేళ మరో గ్రహం అనుకూలంగా ఉందంటే.. దానర్థం భూమిని నిర్జీవంగా వదిలేయాలని కాదు. ఈ పుడమిపై ఉన్న జీవవైవిధ్యాన్ని కాపాడటం ప్రతీ మానవుడి విధి. భూమి తనంతట తాను నిర్జీవమయ్యే పరిస్థితి రావడానికి ఇంకా కొన్ని వందల కోట్ల సంవత్సరాలు ఉన్నప్పటికీ, మానవ తప్పిదాల వల్ల అది నేడో రేపో అనే స్థితికి వచ్చింది. ఈ భూమిపైనున్న అన్ని జీవరాశులకు సమాన హక్కులున్నాయి. మానవులకు ఎంత హక్కుందో చెట్టు, పుట్ట, జంతువుకు అంతే హక్కుంది. వాటికి లేనిది మనిషికున్నది మేధస్సు మాత్రమే. తమ ఆవాసాన్ని కాపాడుకోవడానికి ఆ మేధస్సును వాడుకోవాలే గాని, నాశనం చేయడానికి కాదు. ఒక జాతి తప్పు మరో జాతికి మరణ శాసనాన్ని రాయకూడదు. దీన్ని గుర్తెరిగి మేలుకున్నప్పుడే మానవుడు తన బాధ్యతను నెరవేర్చినవాడవుతాడు.

# ఉగ్రవాదులను చంపకూడదు పట్టుకుని దాడులపై ప్రశ్నించాలి ఫరూక్ అబ్దుల్లా



జమ్ముకశ్మీర్ మాజీ సీఎం, నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్సీ) అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఉగ్రవాదులను చంపకూడదని అన్నారు. ఇటీవల ఉగ్రదాడులు పెరుగడం వెనుక సూత్రధారులను గుర్తించడం కోసం ఉగ్రవాదులను హతమార్చడం కంటే వారిని పట్టుకోవాలని శనివారం సూచించారు. పట్టుకున్న ఉగ్రవాదులను విచారించడం ద్వారా ఈ దాడులు నిర్వహించే విస్తృత నెట్‌వర్క్‌లు, మాస్టర్‌మైండ్స్ గురించి తెలుస్తుందని అన్నారు. కాగా, బుద్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిపై దర్యాప్తు జరుపాలని ఫరూఖ్ అబ్దుల్లా డిమాండ్ చేశారు. జమ్ముకశ్మీర్‌లో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు కుట్ర జరుగుతోందని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. 'ప్రభుత్వం ఏర్పడగానే ఇలా ఎందుకు జరుగుతోంది? ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు ప్రయత్నించిన వ్యక్తులే ఇలా చేశారా అనే సందేహం ఉంది. వాళ్లను (ఉగ్రవాదులను) పట్టుకుంటే ఇలా ఎవరు చేస్తున్నారో తెలుస్తుంది. అందుకే వారిని చంపకూడదు. వారిని పట్టుకోవాలి. వారి వెనుక ఎవరున్నారో అడగాలి. ఒమర్ అబ్దుల్లాను అస్థిరపరిచేందుకు ప్రయత్నించే ఏజెన్సీ ఉందో లేదో చెక్ చేయాలి' అని మీడియాతో అన్నారు. ఉగ్రదాడుల వెనుక పాకిస్థాన్ ప్రమేయం ఉందా లేదా అన్నది కూడా దర్యాప్తులో తెలుస్తుందని స్పష్టం చేశారు. అయితే ఫరూఖ్ అబ్దుల్లా వ్యాఖ్యలపై విమర్శలు వెల్లువెత్తాయి.

SPHOORTI PATRIKA (Telugu Daily) | PRGI Reg. No. APTEL/26/A0542 | Publisher, Printer & Editor: NarasaNaidu Boya | Printed at: Rajeswari Printers, Kurnool |
Place of Publication: Kurnool, Andhra Pradesh | Cell: 8179446036, 7794947413 | Email: sphoortipatrika@gmail.com | Website: www.sphoortipatrika.com